ఇస్తాంబుల్‌లో పేలుడు
• ఆరుగురు మృతి
• లోపలి పేజీలో..•

PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ♦
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 103 | విజయవాడ, సోమవారం 14 నవంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Monday 14 November 2022 | Rs



విజేత ఇంగ్లండ్

• టీ20 ప్రపంచకప్ ఫైనల్లో పాకిస్థాన్‌పై మెరుపు విజయం
• ఛేదనలో బెన్ స్టోక్స్ అజేయ అర్థ సెంచరీ

• లోపలి పేజీలో..•

స్వల్ప స్కోర్ల మెల్‌బోర్న్ మెగా వార్ థ్రిల్లర్‌లో మేటి జట్టునే విజయం వరించింది. 1992 అనూహ్య విజయ చరిత్ర తరహాలో 2022లో అనిశ్చితి ప్రదర్శనతో కప్పుపై కన్నేసిన పాకిస్థాన్‌ను చిత్తు చేసింది ఇంగ్లండ్. వైట్‌బాల్ ఫార్మాట్‌లో ధనాధన్ దూకుడు మంత్రం పఠించిన ఇంగ్లండ్ 2022 ఐసిసి టి20 ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. ఛేదనలో బెన్ స్టోక్స్ (52 నాటౌట్) వీరోచిత ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. మెగా మ్యాచుల్లో మెరుపు ప్రదర్శనల జోరు కొనసాగించాడు స్టోక్స్. బట్లర్ (26), బ్రూక్ (20), మోయిన్ (19) రాణించగా ఇంగ్లండ్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. శామ్ కరణ్ (3/12) విజృంభణతో తొలుత పాకిస్థాన్ 137 పరుగులకే పరిమితమైంది. ఐసిసి టి 20 ప్రపంచకప్ విజేతగా నిలువటం ఇంగ్లండ్‌కు ఇది రెండోసారి కావటం విశేషం.

వేలాదిమందితో నేవీ మారథాన్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ, విశాఖ

కరోనా కారణంగా రెండేళ్ల పాటు నిల్చిపోయిన నేవీ మారథాన్ 7వ ఎడిషన్‌ను ఆదివారం ఉదయం విశాఖలోని ఆర్‌కె.బీచ్‌లో నిర్వహించారు. దీనిని సినీనటులు అడవి శేషు, మిలింద్ సోమన్ ప్రారంభించారు. నాలుగు విభాగాల్లో మారథాన్ జరిగింది. 42 కిలోమీటర్ల ఫుల్ మారథాన్ ఉదయం 4.15 గంటలకు, 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్ ఉదయం 5.15 గంటలకు, 10కె రన్ ఉదయం 6.15 గంటలకు, 5కె ఫన్ రన్ ఉదయం 6.45 గంటలకు బీచ్‌లోని విశ్వప్రియ ఫంక్షన్ హాలు సమీపం నుంచి ప్రారంభమయ్యాయి. ఎనిమిది వేలమంది నేవీ ఉద్యోగులు, తొమ్మిది వేలమంది సామాన్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారథాన్ డైరెక్టర్ మురళి నన్నపనేని మాట్లాడుతూ వ్యర్థాలను తగ్గించడం, సాధ్యమైనంత గరిష్టంగా ఉత్పత్తి చేసిన వాటిని రీసైకిల్ చేయడం వంటి లక్ష్యంతో క్లీన్ అండ్ గ్రీన్ ఈవెంట్‌గా మార్చడానికి ఈ కార్యక్రమం విస్తృతంగా కృషి చేస్తుందన్నారు. లిమ్కా స్పోర్ట్స్, వైజాగ్ నేవీ మారథాన్ బృందం సస్టైనబిలిటీ అనే కాన్సెప్ట్‌పై పనిచేస్తోందని తెలిపారు. ఆదివారం సేకరించిన వ్యర్థాల నుంచి కొన్ని ఉపయోగకరమైన ఉత్పత్తులను రీసైకిల్ చేయాలని ప్రణాళిక చేస్తున్నామన్నారు. పచ్చదనం, మెరుగైన పర్యావరణం కోసం ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో కొన్ని పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం మారథాన్ విజేతలకు నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు.



నేవీ మారథాన్ ప్రారంభిస్తున్న సినీనటులు అడవి శేషు, మిలింద్ సోమన్



పార్వతీపురంలో సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

సిపిఎస్ రద్దుచేసే వరకూ ఉద్యమం

సంతకాల సేకరణలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- పార్వతీపురం, విజయనగరం టౌన్, గుంటూరు

ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ముప్పుగా మారిన సిపిఎస్‌ను రద్దు చేసే వరకూ ఉద్యమం ఆగేది లేదని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి స్పష్టం చేశారు. అన్ని సంఘాలనూ కలుపుకొని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఎస్ రద్దు కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని బెలగాం చర్చి సెంటర్ వద్ద ఆదివారం చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఎన్.వెంకటేశ్వర్లు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విజయనగరంలోని జిల్లా పరిషత్తు మినిస్టీరియల్ హాల్లో ఏర్పాటు చేసిన సిపిఎస్ సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్లకు లాభాన్ని చేకూర్చే సిపిఎస్, జిపిఎస్ విధానాలను యుటిఎఫ్ అంగీకరించదని తేల్చి చెప్పారు. ఒపిఎస్ మాత్రమే ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు అంగీకారమని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేసి, మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పోరాటాలను చూసి ప్రభుత్వం భయపడుతూ, మనల్ని భయపెట్టాలని చూస్తోందని, అందులో భాగంగా నిర్బంధాలకు పాల్పడుతోందని అన్నారు. ఎన్ఎస్‌డిఎల్‌లో ఉన్న డబ్బులు తిరిగి తీసుకునే హక్కు రాష్ట్రాలకు లేదని ఇటీవల కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించడం దారుణమని పేర్కొన్నారు. సిపిఎస్ ఉంచాలా? ఒపిఎస్ పునరుద్ధరించాలా? అనేది రాష్ట్ర ప్రభుత్వ ఇష్టమని, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా సీతారామన్ మాట్లాడడం ఏమిటని ప్రశ్నించారు. సిపిఎస్ రద్దు కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని, అందులో భాగంగా ఇంటింటి ప్రచారం, పాదయాత్రలు, మినీ సభలు డిసెంబరు నెలాఖరు వరకూ నిర్వహిస్తామని కార్యాచరణను వెల్లడించారు. సంతకాల సేకరణకు ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ మన్యం జిల్లా అధ్యక్షులు కిశోర్, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు మద్దతు ప్రకటించారు. కార్యక్రమాల్లో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, ఎస్.మురళీమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులూ ఉద్యమించాలి : పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి

పోరాటాల ద్వారానే సిపిఎస్ రద్దు సాధ్యమని పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి అన్నారు. ఒపిఎస్ కోసం గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు కూడా ఉద్యమించాలని కోరారు. గుంటూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సిపిఎస్ ఉపాధ్యాయుల సదస్సులో సాబ్జి మాట్లాడారు. సిపిఎస్ రాష్ట్ర పరిధిలో లేదని వాదించిన వారు ఇటీవల ఛత్తీస్‌గఢ్, ఒడిశా పలు రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాన్ని గుర్తించాలన్నారు. ప్రభుత్వ నిర్బంధాలను ఎదుర్కొని న్యాయమైన హక్కుల సాధనకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఐక్యంగా పోరాడాలని కోరారు. జిల్లా అధ్యక్షులు ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం హామీని నిలబెట్టుకొని చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, సిపిఎస్ కన్వీనర్ ఆదినారాయణ ప్రసంగించారు.

అవినీతికి వ్యతిరేకంగా పోరాడండి
• గుంకలాం పర్యటనలో పవన్ కల్యాణ్
• లోపలి పేజీలో..•

శిలాజ ఇంధనాల్ని తగ్గించండి

కాప్27 సదస్సులో భారత్ ప్రతిపాదన

పలు దేశాల సమర్థన



కైరో : శిలాజ ఇంధన వినియోగాన్ని ఆపడమే వాతావరణ సమస్యలకు పరిష్కారమని భారత్ పేర్కొంది. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో వాతావరణ మార్పులపై ఈజిప్టులో జరుగుతున్న కాప్ 27 సదస్సులో భారత్ ప్రతినిధులు ఈ విషయాన్ని ప్రతిపాదించారు. భూతాపాన్ని కనీస స్థాయికి నియంత్రించాలన్న ప్యారిస్ ఒప్పంద లక్ష్యాన్ని సాధించాలంటే శిలాజ ఇంధన వినియోగాన్ని సాధ్యమైనంత మేర తగ్గించాల్సి ఉంటుందని భారత్ పేర్కొంది. ఒకేసారి కాకపోయినా దశలవారీగానైనా ఆ తరహా ఇంధన వినియోగాన్ని తగ్గించడం ప్రారంభించాలని, క్రమేణా పూర్తిగా మానుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. వాతావరణ మార్పులపై ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ రూపొందించిన ఆరవ అంచనా నివేదికపై శని, ఆదివారాల్లో చర్చ జరిగింది. ఈ నివేదికలో వాతావరణ కాలుష్యానికి కారణమైన ఉద్గారాల విడుదల గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా స్వల్ప స్థాయిలో పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. మిగిలిన దేశాలతో పోలిస్తే భారత్‌లో ఉద్గారాల విడుదల ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అంచనా వేశారు. గత ఏడాదితో పోలిస్తే భారత్ ఉద్గారాల వాటా ఆరు శాతం పెరిగే అవకాశం ఉందని, దీనిలో అధికభాగం బొగ్గు వినియోగం ద్వారా వచ్చేదని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన భారత్ ప్రతినిధులు వివిధ దేశాల్లో జరుగుతున్న శిలాజ ఇంధన వినియోగాన్ని ప్రస్తావించారు. 'సహజ వాయువు, ఆయిల్ వినియోగం కూడా వాతావరణ కాలుష్యానికి కారణం అవుతోంది. అవికూడా కాలుష్య కారక ఉద్గారాలను వెదజల్లుతున్నాయి. ఈ విషయాన్ని విస్మరించి ఏ ఒక్క ఇంధనాన్నో విలన్‌గా చూపడం సరికాదు.' అని భారత్ ప్రతినిధులు వాదించారు. భారత్ లేవనెత్తిన ఈ అంశం సమావేశంలో తీవ్ర స్థాయిలో చర్చకు దారి తీసిందని సమాచారం. చర్చల్లో పాల్గొన్న 194 దేశాల ప్రతినిధుల్లో పలువురు భారత్ లేవనెత్తిన ఈ అంశాన్ని సమర్థించినట్లు తెలిసింది. వీరిలో కొందరు వాతావరణ మార్పులకు సంబంధించి చారిత్రక బాధ్యత (హిస్టారికల్ రెస్పాన్సిబిలిటీ)ను ప్రస్తావించడానికి ప్రయత్నించారని సమాచారం.

ప్రాతిపదిక ఏమిటి?

పొంచిఉన్న ప్రమాదానికి ఏదో ఒక ఇంధనాన్నో, ఉద్గారాన్నో కారణంగా చూపి ముద్ర వేస్తున్నారని, మిగిలిన వాటిని పర్యావరణ హితమనో, సుస్థిరమైనవనో చెప్పడాన్ని భారత ప్రతినిధి బృందం తప్పు పట్టింది. అలా చెప్పడానికి ప్రాతిపదిక ఏమిటని నిలదీసింది. 'ప్రస్తుతానికి ఉన్న సైన్స్ ప్రకారం అన్ని శిలాజ ఇంధనాలు గ్రీన్‌హౌస్ వాయువులను వెదజల్లుతాయి. వాతావరణ కాలుష్యాన్ని పెంచుతాయి. దీనికి భిన్నంగా చెప్పడానికి ప్రాతిపదిక ఏమిటో వెల్లడించాలి. జాతీయ పరిస్థితుల కనుగుణంగా అంతర్జాతీయ లక్ష్యమైన క్లీన్ ఎనర్జీ వైపు ఏ దేశమైనా ప్రయాణించాల్సి ఉంటుంది' అని భారత్ ప్రతినిధులు చెప్పారు. వివిధ రంగాలలో అసమానతలతో ఉన్న పరిస్థితులలో ప్రస్తుత సమాజం మనుగడ సాగిస్తోందన్న అంశాన్ని కూడా గుర్తుంచుకోవాలని అన్నారు.

దారిఖర్చులూ రాలేదు

టమోటా రైతు విలవిల


పత్తికొండ మార్కెట్‌కు వచ్చిన టమోటా

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

దారిఖర్చులు కూడా రావడం లేదంటూ టమోటా రైతులు విలవిలలాడుతున్నారు. రైతులకు కిలో టమోటాకు రెండు రూపాయలలోపే ధర లభిస్తోంది. కనీసం కూలి, రవాణా ఖర్చులు కూడా రాకపోవడంతో ఆరుబయట పారబోసేసి రైతులు తమ నిరసన తెలుపుతున్నారు. పది రోజుల నుంచి టమోటా ధర దారుణంగా పడిపోతూ వచ్చింది శనివారం ఒక గంప (15 కిలోలు)కు రూ.25 ధర మాత్రమే లభించింది. దీంతో, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎకరా విస్తీర్ణంలో టమోటా సాగుకు రూ.50 వేల పెట్టుబడి అవుతోంది. ఎకరాకు ఎనిమిది నుంచి పది టన్నుల వరకూ దిగుబడి వస్తుంది. ఇప్పటి ధర ప్రకారం రూ.15 వేలు కూడా వచ్చే పరిస్థితి లేదు. 2010 సంవత్సరం కంటే ముందు ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 20 వేల ఎకరాల్లో టమోటాను సాగు చేసేవారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా నాటు రకమైన టమోటా పండించేవారు. రాష్ట్రంలోని మదనపల్లి, అనంతపురం, కర్ణాటక రాష్ట్రంలోని చింతామణి తదితర ప్రాంతాల్లో హైబ్రిడ్ రకం టమోటా సాగు చేయడంతో ఎక్కువ దిగుబడితోపాటు నాణ్యమైన పంట వస్తోంది. నాటు టమోటాకు డిమాండ్ కరువవడంతో క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గింది. ఆ తర్వాత ఇక్కడి వారు కూడా హైబ్రిడ్ రకం టమోటా సాగు ప్రారంభించారు. దీంతో, క్రమంగా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. కర్నూలు జిల్లాలోని ఆదోని, ఆస్పరి, పత్తికొండ, ప్యాపిలి, డోన్ ప్రాంతాల్లో ఈ ఏడాది దాదాపు 7,500 ఎకరాల్లో టమోటా సాగు చేశారు. అక్టోబర్‌లో కురిసిన వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతినడంతో దిగుబడి భారీగా తగ్గిపోయింది. ఆ సమయంలో ధరలు పెరిగాయి. ప్రస్తుతం కొన్ని రోజులుగా వాతావరణం అనుకూలంగా ఉండడంతో దిగుబడులు పెరుగుతున్నాయి. జిల్లాలోని మార్కెట్ల ద్వారా రోజుకు 20 లారీలకుపైగా టమోటాను వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాదు, సికింద్రాబాద్ మార్కెట్లకు తరలించి కిలో రూ.20కుపైగా విక్రయించి లాభపడుతున్నారు. పత్తికొండ మార్కెట్లో అత్యధికంగా టమోటా క్రయవిక్రయాలు సాగుతున్నాయి. ఆ మార్కెట్‌లో గతేడాది 730 టన్నుల టమోటా విక్రయాలు జరిగాయి. ప్రస్తుత ఏడాది ఇప్పటి వరకూ 320 టన్నుల టమోటా విక్రయాలు జరిగినట్లు అధికారులు తెలిపారు. శనివారం 2.79 టన్నుల క్వింటాళ్ళు అమ్ముడయ్యాయి. రోజుకు సరాసరి మూడు టన్నుల చొప్పున సరుకు వస్తోంది. రెండు రోజుల క్రితం వరకూ కిలో టమోటాకు రెండు రూపాయల ధర లభించేది. ప్రస్తుతం అంతకంటే ధర తగ్గిపోయింది. కనీసం కూలి, రవాణా ఛార్జీలు కూడా రాకపోవడంతో కొందరు రైతులు టమోటాలను పత్తికొండ మార్కెట్‌లోనే పారబోసి వెళ్లిపోతున్నారు.

ఖర్చులు కూడా రాలేదు




ఎకరా విస్తీర్ణలో టమోటా సాగు చేశాను. రూ.50 వేల వరకూ పెట్టుబడి అయింది. 19 గంపల టమోటాను మార్కెట్‌కు తీసుకెళ్లాను. ఒక్కో గంపకు రూ.25 మాత్రమే ధర లభించింది. పెట్టుబడిమాట అటుంచి కనీసం రవాణా ఛార్జి, టమోటాను ఏరించడానికి అయిన కూలీల ఖర్చులు కూడా రాలేదు.
- నడిపి రాముడు, చక్రాల, పత్తికొండ మండలం

ఔను ! అమిత్ షా తరపున వాదించా !

• మాజీ సిజెఐ జస్టిస్ యుయు లలిత్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో : న్యాయ నియామకాల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బిజెపి నేతల ప్రయేముందని, వారికి కావాల్సినవారినే కీలక పదవుల్లో నియమించుకుంటున్నారనే విమర్శల నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజా మాజీ ప్రధానన్యాయమూర్తి జస్టిస్ యుయు లలిత్ కీలక వ్యాఖ్యలు చేశారు. జాతీయ వార్తా సంస్థ ఎన్‌డిటివి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో కొలీజియం వ్యవస్థ సహా అనేక అంశాలపై ఆయన మాట్లాడారు. గతంలో గుజరాత్‌కు సంబంధించిన సోహ్రాబుద్దీన్ షేక్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో తాను అమిత్ షా తరపున కోర్టుకు హాజరైన మాట వాస్తవమేనని జస్టిస్ యుయు లలిత్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఎన్‌డిటివి ప్రతినిధి అడిగిన ఒక ప్రశ్నకు ఆయన బదులిస్తూ 'ఔను అమిత్ షా తరపున హాజరైన మాట నిజం. అయితే రామ్ జెఠ్మలానీ నేతృత్వంలోనే హాజరయ్యాం' అని ఆయన తెలిపారు. గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర హోంమంత్రిగా అమిత్ షా ఉన్నప్పుడు ఈ నకిలీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకున్న విషయం విదితమే. కేంద్రంలో 2014 మే నెలలో ప్రభుత్వం మారినప్పటికినీ అంతకంటే ముందుగానే అంటే యుపిఎ అధికారంలో ఇంకా ఉండగానే 'జడ్జి అవుతారా' అని తనను మిగతా 5లో



ఆర్‌ఎస్‌పి ప్రధాన కార్యదర్శిగా మనోజ్ భట్టాచార్య

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్‌ఎస్‌పి) ప్రధాన కార్యదర్శిగా మనోజ్ భట్టాచార్య ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికయ్యారు. మూడు రోజుల పాటు ఢిల్లీలో జరిగిన ఆర్‌ఎస్‌పి 22వ జాతీయ మహాసభ ఆదివారం విజయవంతంగా ముగిసింది. 53 మందితో కేంద్ర కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఆంధ్రప్రదేశ్ నుంచి నేరెళ్ల కళ్యాణ్ ఓబులేష్, తెలంగాణ నుంచి జూపల్లి జానకి రాములు కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు. పశ్చిమ బెంగాల్ నుంచి 23 మంది, కేరళ నుంచి 20 మంది, తమిళనాడు ఇద్దరు, ఢిల్లీ ఇద్దరు, ఏపి, తెలంగాణ, అస్సాం, జార్ఖండ్, త్రిపుర, పంజాబ్ నుంచి ఒక్కొక్కరు చొప్పున కమిటీకి ఎన్నికయ్యారు. ఈ మహాసభకు 12 రాష్ట్రాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరుకాగా, ఏపి నుంచి 5 మంది, తెలంగాణ నుంచి 9 మంది హాజరయ్యారు. జనవరిలో జరిగే కేంద్ర కమిటీ సమావేశంలో కేంద్ర కార్యవర్గ సభ్యులను ఎన్నుకుంటారు.

హక్కుల కార్యకర్తలను విడుదల చేయండి

• ఐరాస 'యూనివర్సల్ పిరియడ్ రివ్యూ' సమావేశంలో పలు దేశాలు

జెనీవా : భారత్‌లో పౌర హక్కులపై కఠిన ఆంక్షలు విధిస్తున్నారని, తీవ్రవాద వ్యతిరేక చట్టాలను ఉపయోగించటం పెరిగిందని 'ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిషన్' ఆందోళన వ్యక్తం చేసింది. భారత్‌లో మానవ హక్కుల పరిస్థితిపై కౌన్సిల్ నేతృత్వంలో జెనీవాలో ఇటీవల సమీక్ష జరిగింది. 'యూనివర్సల్ పిరియడ్ రివ్యూ' (యుపిఆర్)గా పేర్కొనే ఈ సమీక్షా సమావేశంలో సభ్యదేశాల ప్రతినిధులు, పౌరహక్కుల కార్యకర్తలు, జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హక్కుల కార్యకర్తలు, జర్నలిస్టులు భారత్‌లో పౌర హక్కుల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం తరపున పాల్గొన్న ప్రతినిధుల బృందానికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా నేతృత్వం వహించారు. పౌర హక్కులు, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం భారత ప్రభుత్వం చేపట్టిన పలు చర్యల్ని సమావేశంలో ఆయన ప్రస్తావించారు. యుపిఆర్ సమావేశంలో 130 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆ సమావేశంలో వారు మాట్లాడుతూ.. కొన్ని సూచనలు, ప్రతిపాదనలు చేశారు.

లింగ వివక్ష, హింసను రూపుమాపడానికి భారత్‌లో చట్టాలు ఉన్నా.. సమాజంలో కొనసాగుతున్నాయని అమెరికా ప్రతినిధి ఆందోళన వ్యక్తం చేశారు. ఉపా చట్టం పేరుతో హక్కుల కార్యకర్తల్ని అరెస్టు చేసి జైల్లో నిర్బంధిస్తున్నారని, సుదీర్ఘకాలం విచారణ కొనసాగుతోందని తెలిపారు. అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలకు అనుగుణంగా ఉపా చట్టంలో భారత్ మార్పులు చేయాలని కెనడా అభిప్రాయపడింది. విదేశీ విరాళాల నియంత్రణ చట్టాన్ని (ఎఫ్‌సిఆర్ఎ) ప్రయోగిస్తూ, ఎన్జీవో సంస్థలకు ఇస్తున్న లైసెన్స్ ప్రక్రియలో పారదర్శకత తీసుకురావాలని అమెరికా కోరింది. ఎఫ్‌సిఆర్ఎ, ఉపా చట్టాలపై సమీక్ష చేయాలని భారత్‌కు ఈస్తోనియా సూచించింది. జైల్లో నిర్బంధించిన హక్కుల కార్యకర్తలను విడుదల చేయాలని ఐర్లాండ్, జర్మనీ, స్విట్జర్లాండ్, బెల్జియం, లక్జెంబర్గ్ సూచించాయి. వాక్‌స్వాతంత్ర్యం, నిరసన తెలిపే హక్కుకు అవకాశం కల్పించాలని లాటిన్ అమెరికా, యూరప్ దేశాలు అభిప్రాయపడ్డాయి. 2022 యుపిఆర్ సమావేశానికి సంబంధించిన పూర్తిస్థాయి నివేదిక మరికొద్ది వారాల్లో ఐరాస విడుదల చేయనున్నది.

సముద్రంలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి


ప్రసాద్


తేజేశ్వరరావు

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఆదివారం విషాదం చోటుచేసుకుది. సముద్రతీరంలో స్నానానికి వెళ్లిన ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లావేరు మండలం మురకపాక పంచాయతీకి చెందిన కలమట ప్రసాద్ (16), ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటకు చెందిన బెండి తేజేశ్వరరావు (20) స్నేహితులు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో తేజేశ్వరరావు డిగ్రీ, ప్రసాద్ ఇంటర్ చదువుతున్నారు. వీరిద్దరితోపాటు మరో ఐదుగురు కలిసి బుడగట్లపాలెం సముద్రతీరానికి పిక్నిక్ కోసం వెళ్లారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో అందరూ సముద్ర స్నానానికి దిగారు. అంతా ఒడ్డుకు చేరుకున్నా వీరిద్దరూ చేరకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు మొదలు పెట్టారు.

హోదా, విభజన హామీల అమలు కోసం 16 నుండి నిరసనలు

• 26న ఢిల్లీలో ధర్నా
• సాధన సమితి ప్రకటన


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి ప్రత్యేకహోదా ప్రకటించడంతో పాటు, విభజన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ మరోసారి ప్రజా ఉద్యమాన్ని చేపడుతున్నట్టు సాధనసమితి ప్రకటించింది. ఆదివారంనాడు విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మేధావు ఫోరం కన్వీనర్ చలసాని శ్రీనివాస్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, నాయకులు దోనెపూడి శంకర్, కాంగ్రెస్ నాయకులు నరహరిశెటి నరసింహారావు, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్నకుమార్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి జాన్సన్‌బాబు తదితరులు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న అన్యాయంపై విద్యార్థి సంఘాలు, వామపక్షపార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకుని ఢిల్లీ నుంచి గల్లీ వరకు మరోమారు బలమైన ప్రజాఉద్యమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు.



మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్

ఇందులో బాగంగా ఈ నెల 16వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామని, 26న ఢిల్లీలో ధర్నా చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు కోట్లమంది ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీకి తాకట్టు పెట్టిందని విమర్శించారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేసి మోడీకి స్వాగతం పలికన ముఖ్యమంత్రి రాష్ట్రానికి ఏ హామీని రాబట్టారో చెప్పాలని కోరారు. స్టీల్‌ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వామపక్ష నేతలను, కార్యకర్తలను అరెస్టులు చేయడాన్ని తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్, జనసేన పార్టీలు కనీసంగా ఖండించక పోవడం తగదని అన్నారు.



ఫ్లైఓవర్ కింద ఇరుక్కున్న విమానం

ఫ్లైఓవర్ కింద ఇరుక్కుపోయిన విమానం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్ తరలిస్తున్న పాత బోయింగ్ విమానం బాపట్ల జిల్లా మేదరమెట్ల ఫ్లైఓవర్ అండర్‌పాస్ వద్ద ఆదివారం ఇరుక్కుపోయింది. పాత విమానాన్ని కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్ నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. శామీర్‌పేట 'పిస్తాహౌస్' యజమానులు పాత బోయింగ్ విమానాన్ని వేలం పాటలో కొనుగోలు చేశారు. దీన్ని హోటల్‌గా మార్చేందుకు కొచ్చిన్ నుంచి లారీ ట్రాలీపై హైదరాబాద్ తరలిస్తున్నారు. శనివారం రాత్రి మేదరమెట్ల బైపాస్‌లోని అండర్‌పాస్ వద్ద విమానాన్ని తరలిస్తున్న ట్రాలీ ఇరుక్కుపోయింది. మేదరమెట్ల వద్ద కొండరాళ్లను తొలగించే పనులు ప్రారంభం కావడంతో హైదరాబాద్ వైపు వెళ్లే రోడ్డును ఒక వైపు మూసివేశారు. అటువైపు వెళ్లే వాహనాలను ఫ్లైఓవర్ మీదుగా కొరిశపాడు అండర్ పాస్ ద్వారా మళ్లిస్తున్నారు. ఈ క్రమంలో విమానాన్ని తరలిస్తున్న లారీ ఇరుక్కుపోయింది. దానిని అండర్ పాస్ నుంచి బయటకు తెచ్చి మరో మార్గంలో హైదరాబాద్‌కు తరలించారు.

మరో 600 రోజులైనా దీక్షలు కొనసాగిస్తాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం మరో ఆరు వందల రోజులైనా పోరాటం కొనసాగిస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ తెలిపింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 640వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఒప్పంద కార్మికులు కూర్చున్నారు. ఈ దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ ప్రతినిధులు డి ఆదినారాయణ, పి శ్రీనివాసరాజు, ఎఐటియుసి నాయకులు పడాల రమణ మాట్లాడుతూ ప్రధాని మోడీ పర్యటనను సద్వినియోగం చేసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తులతో సంబంధం లేకుండా ప్రధాని ప్రసంగం సాగిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రతిపక్ష పార్టీలను కలుపుకుంటూ ప్రధానిపై ముఖ్యమంత్రి ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. పోరాట కమిటీ నాయకులు కెఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రం దిగి వచ్చే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఒవి రావు, అధ్యక్షులు జి శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వివి రమణ, నాయకులు పి మసేను, యు సోమేష్, ఒప్పంద కార్మికులు బి ఆనంద్, ఆర్ఎన్ ఆంజనేయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అర్ధరాత్రి వేళ సూర్యాపేట - విజయవాడ జాతీయ రహదారి రక్తసిక్తమయింది. సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రం శివారులోని పెట్రోల్ బంక్ వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అయిదుగురు మృతి చెందారు. మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ప్రకారం.. మునగాల మండల కేంద్రానికి చెందిన పలువురు సమీపంలోని సాగర్ ఎడమ కాలువ గట్టుపై ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం రాత్రి మహాపడి పూజకు హాజరయ్యారు. వారిలో దాదాపు 38 మంది ట్రాక్టర్ ట్రాలీలో ఇళ్లకు తిరుగు ప్రయాణమయ్యారు. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వెళ్తుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే తన్నీరు ప్రమీల(35), చింతకాయల ప్రమీల(33), ఉదయ్‌లోకేశ్(8), నారగాని కోటయ్య(55) ప్రాణాలు కోల్పోయారు. కోదాడ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ గండు జ్యోతి(38) మరణించారు. పరిస్థితి విషమంగా ఉన్నవారిని ఖమ్మం,హైదరాబాద్ ఆసుపత్రులకు తరలించారు.

మరో ఐదేళ్లయినా పోలవరం పూర్తికాదు : హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం కంటే ముందే మొదలుపెట్టిన పోలవరం ప్రాజెక్టు పనులు ఇంకా పూర్తి కాలేదని, మరో ఐదేళ్లయినా పూర్తి చేయలేరని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో ఆదివారం మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ... పోలవరం పనుల పురోగతిపై అక్కడి ఇంజినీర్లతో మాట్లాడా.. మరో ఐదేళ్లలో పూర్తయితే గొప్పేనని వారు చెప్పారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయి ఆ ఫలితాలు తెలంగాణ ప్రజలకు అందుతున్నాయి.. కానీ, కేంద్రం చేపట్టిన జాతీయ ప్రాజెక్టు పోలవరం పూర్తి కాలేదని, ఆ ఫలితం ప్రజలకు అందలేదని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విపక్షాలు అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు.కాళేశ్వరం గురించి ప్రతిపక్ష నేతలు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రధాని మోడీ తెలంగాణ పర్యటనలో భాగంగా చేసిన వ్యాఖ్యలపై మంత్రి హరీశ్ రావు ట్విట్టర్ వేదికగా స్పందించారు.

లౌకిక రాజ్యాంగ పరిరక్షణ కోసం

6న విజయవాడలో సదస్సు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బాబ్రీమసీదును కూల్చివేసిన డిసెంబరు 6ను లౌకిక రాజ్యాంగ పరిరక్షణ దినంగా నిర్వహించడంతో పాటు, విజయవాడ బందరు రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో భారీ సదస్సు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక సమావేశం నిర్ణయించింది. విజయవాడ దాసరిభవన్‌లో ఆంధ్రప్రదేశ్ లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన వేదిక ఛైర్మన్ మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ విజయవాడలో నిర్వహించనున్న ఈ సదస్సుకు పెద్దసంఖ్యలో ప్రజాస్వామ్యవాదులు తరలి రావాలని కోరారు.కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, మహిళలపైన దాడులు పెద్దఎత్తున జరుగుతున్నాయని అన్నారు.

వేదిక కన్వీనరు కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం లక్ష్యాలకు ఆశయాలకు స్ఫూర్తికి విఘాతం కలిగే విధంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. రాజ్యాంగ ఆశయాలైన సమాఖ్య విధానాన్ని లౌకిక విధానాన్ని భావ ప్రకటనా స్వేచ్ఛను, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోందన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు చిత్రంలో గఫూర్, జల్లి విల్సన్ తదితరులు

స్వతంత్రంగా పనిచేయాల్సిన న్యాయవ్యవస్థను సైతం లొంగదీసుకునే ప్రయత్నాలకు మోడీ ప్రభుత్వం పాల్పడుతోందన్నారు.

విజయవాడలో నిర్వహించనున్న సదస్సుకు వివిధ రంగాలకు చెందిన జాతీయస్థాయి, రాష్ట్ర స్థాయి ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎ గఫూర్, న్యాయవాధి అబ్దుల్ మతీన్, ఇన్సాఫ్ కన్వీనరు సయ్యద్ అఫ్సర్, నవభూమి-కె9 టివిసిఇఒ ఎండి షఫీ అహమ్మద్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జెవి ప్రభాకర్, కరవది సుబ్బారావు, ఉపాధ్యక్షులు తాటిపాక మధు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మిక సంఘం నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నుంచి బండి వెంకటేశ్వరరావు, ఆర్ వెంకట్రావు, సి.సుబ్రహ్మణ్యం, చిలుకూరి వెంకటేశ్వరరావు, కాబోతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి వ్యతిరేకంగా పోరాడండి

- గుంకలాం పర్యటనలో పవన్ కల్యాణ్

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

అవినీతికి వ్యతిరేకంగా జనసైనికులు పోరాడాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ కోరారు. ప్రభుత్వం కేసులు బనాయిస్తే తాను కూడా కార్యకర్తలు, ప్రజల వెంట ఉంటానని, జైళ్లలో ఎంతమందిని పెడతారో తేలుతుందని వ్యాఖ్యానించారు. అవినీతిపై వైసిపి నాయకుల చొక్కా పట్టుకుని నిలదీయాలని కోరారు. జగనన్న ఇళ్లు.. పేదలకు కన్నీళ్లు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన విజయనగరం సమీపం లోని గుంకలాంలో జగనన్న కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ రెండేళ్లలో పూర్తి చేస్తామన్న ఈ కాలనీ పనులు నేటికీ పూర్తి కాలేదన్నారు. రాష్ట్రంలో ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూమి కొనుగోలు మొదలుకుని, కాలనీల్లో మౌలిక సదుపాయాల పేరిట కేటాయించిన రూ.23,500 కోట్లల్లో భారీ మొత్తాన్ని దారి మళ్లించారని ఆరోపిం చారు. పన్ను రూపంలో ప్రజలు చెల్లించిన సొమ్మును దుర్వినియోగం చేస్తే ఊరుకోబోమని



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్

హెచ్చరించారు. కాలనీల్లో మౌలిక సదుపాయాల పేరిట పాల్పడిన అవినీతిపై ప్రధాని మోడీకి నివేదిక అందజేస్తానన్నారు. వైసిపి నాయకులు బొత్స, సజ్జల ఢిల్లీకి వెళ్లి తనపై చాడీలు చెబుతున్నారని, తాను మాత్రం ఎక్కడి సమస్య అక్కడే మాట్లాడుతున్నానని పేర్కొన్నారు. విశాఖకు రాజధానిగా మారిస్తే జీవితాలు మారిపోతాయంటూ భ్రమలు కల్పిస్తున్నారని అన్నారు. ఇప్పటికే విశాఖలోని పోలీసుల, సైనికుల కోసం కేటాయించిన భూములను ఆక్రమించుకున్నారని ఆరోపించారు.

బాబు మార్గదర్శకత్వంలోనే పవన్ విమర్శలు

- మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో ఎక్కడా అమలు చేయని రీతిలో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఇళ్లనిర్మాణం చేపడుతుంటే చంద్రబాబు మార్గదర్శకత్వంలో పవన్‌కల్యాణ్ విషం చిమ్ముతున్నారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. తెలుగుదేశం హయాంలో 2014 నుంచి 2019 వరకూ ఎంతమందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారో పవన్ చెప్పాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. విజయనగరం జిల్లా గుంకలాంలో జగన్ ప్రభుత్వం 12వేల మందికి ఇళ్లస్థలాలను ఇచ్చిందన్నారు. గుంకలాంలోని ఇళ్లస్థలాల లబ్ధిదారుల తిరుగుబాటుతోనైనా పవన్‌కల్యాణ్‌లో మార్పురావాలని అన్నారు. అక్కడ అంతా బాగుందని చెప్పడంతో, పవన్ కల్యాణ్ అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో 31లక్షల మందికి ఇళ్లస్థలాలను ఇచ్చామని, అందులో 21లక్షల స్థలాల్లో ఇళ్లనిర్మాణం చేపట్టామని తెలిపారు. లోకేష్ మోకాళ్లు అరిగేలా పాదయాత్ర చేసినా ఉపయోగం లేదని అన్నారు.

'హంద్రీ - నీవా' నీటిని విడుదల చేయాల్సిందే

- లేదంటే ఎస్ఇ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- రైతుల రాస్తారోకో

ప్రజాశక్తి - దేవనకొండ (కర్నూలు జిల్లా)

హంద్రీనీవా ప్రధాన కాలువకు గత మూడు రోజులుగా నీటి సరఫరా నిలిపివేయడాన్ని నిరసిస్తూ కర్నూలు జిల్లా దేవనకొండ బస్టాండు వద్ద ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన రైతులు ఆదివారం రాస్తారోకో చేశారు. నీటి సరఫరాను పునరుద్ధరించకపోతే కర్నూలులోని హంద్రీనీవా ఎస్‌సి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.వీరశేఖర్ మాట్లాడారు. గత 20 రోజుల వ్యవధిలోనే హంద్రీనీవా ప్రధాన కాలువకు నీటిని రెండోసారి నిలిపేశారన్నారు. దీంతో, ఆయకట్టు పరిధిలోని పంటల పరిస్థితిపై రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కాంట్రాక్టర్‌కు విద్యుత్తు బిల్లులు చెల్లించకపోవడం, తరచూ నీటి సరఫరాను నిలిపివేయడం సరికాదని అన్నారు.

హంద్రీనీవా నిర్వహణకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, సాగునీటి కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. పందికోన రిజర్వాయర్ కెపాసిటీని పెంచి కుడి, ఎడమ కాలువల ద్వారా



కర్నూలు జిల్లా దేవనకొండ బస్టాండు వద్ద ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన రైతులు ఆదివారం రాస్తారోకో

ప్రభుత్వం నిర్దేశించుకున్న 65 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రంగారెడ్డి, మండల సీనియర్ నాయకులు తెర్నేకల్ శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దస్తగిరి, సిఐటియు మండల కార్యదర్శి అశోక్, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి విలేకరి భాగ్యరాజ్ మృతి

ప్రజాశక్తి-నెల్లూరు



నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం ప్రజాశక్తి విలేకరి భాగ్యరాజు (35) ఆదివారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయనకు భార్య శిరీష, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భాగ్యరాజు మూడున్నరేళ్లుగా బుచ్చిరెడ్డిపాళంలో విలేకరిగా విధులు నిర్వహిస్తున్నారు. ఎంతో నిబద్ధతతో పని చేస్తున్న భాగ్యరాజు మధ్యాహ్నం వరకు వార్తలు సేకరించారు. విధుల్లో ఉండగానే గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భాగ్యరాజు అకస్మిక మృతికి సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, సిజిఎం వై.అచ్యుతరావు, న్యూస్ ఎడిటర్ వి.రాజగోపాల్ శర్మ, ప్రజాశక్తి జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ కె కోటేశ్వరరావు, డెస్క్ ఇన్‌ఛార్జి యువి రమణయ్య, స్టాఫర్ పి బాలకృష్ణ, ఎపియుడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి మధు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.సుధాకర్, పలువురు జర్నలిస్టులు సంతాపం తెలిపారు.

ఢిల్లీ లిక్కర్ స్కాంపై జగన్ సమాధానం చెప్పాలి

- టిడిపి నేత బొండా ఉమా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపి విజయసాయిరెడ్డి రాష్ట్రప్రజలకు సమాధానం చెప్పాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో శాండ్, ల్యాండ్, వైన్, మైన్‌లపై దోచుకున్న నల్లధనంతో ఇతర రాష్ట్రాల్లో జగన్, విజయసాయిరెడ్డి అక్రమ వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. విజయసాయిరెడ్డి ఢిల్లీలో కూర్చుని వ్యవస్థలను మేనేజ్ చేస్తూ మద్యం వ్యాపారాలు చేయడంలో బిజీ అయ్యారని అన్నారు. అరబిందో సంస్థ పెట్టుకుని పద్ధతిగా బతుకుతున్న శరత్ చంద్రారెడ్డిని అక్రమ సంపాదన కోసం బలిపశువును చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. శ్రీఅవంతిక, ట్రైడెంట్ కంపెనీలతో సంబంధం లేదని చెప్పే ధైర్యం జగన్‌తో సహా ఏ వైసిపి నేతకైనా ఉందా అని నిలదీశారు.

జర్నలిస్టుల పట్ల జగన్ వివక్ష : అనగాని

రాష్ట్రంలో జర్నలిస్టుల పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వివక్ష చూపుతున్నారని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ విమర్శించారు. కుట్రపూరితంగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్లను నిలిపివేశారని, ఇళ్లస్థలాలిస్తామన్న హామీ గాలికొదిలేశారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరోనాతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సాయం అందలేదని పేర్కొన్నారు. ఆరోగ్య బీమా కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటని విమర్శించారు. జర్నలిస్టుల పిల్లలందరికీ 50శాతం ఫీజు రాయితీని అన్ని జిల్లాల్లో అమలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



రాష్ట్ర ఖోఖో పోటీల చాంపియన్ 'ప్రకాశం'

- పురుషులు, మహిళల జట్లలోనూ జిల్లాదే గెలుపు..

ప్రజాశక్తి-ముండ్లమూరు

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ప్రకాశం జిల్లా విజయకేతనం ఎగరవేసింది. పురుషులు, మహిళా జట్లలో.. రెండింటిలోనూ జిల్లాకు చెందిన జట్లే గెలుపొందాయి. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ఈ నెల 11న ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలోని ఈదరలోని జిల్లా పరిషత్ హైస్కూలు ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో 13 జిల్లాల నుండి మొత్తం 27 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ప్రకాశం, కృష్ణా జిల్లా జట్లు తలపడగా ప్రకాశం జిల్లా జట్టు గెలుపొందింది. పురుషుల విభాగంలో ప్రకాశం, విజయనగరం జిల్లా జట్లు తలపడగా ప్రకాశం జిల్లా విజయం సాధించింది. మహిళా విభాగంలో రెండో బహుమతి కృష్ణా జిల్లా, పురుషుల విభాగంలో విజయనగరం జిల్లా జట్లు కైవసం చేసుకున్నాయి. విజేతలకు జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ బహుమతులు ప్రదానం చేశారు.

హక్కుల కోసం బిసిలు ఐక్యంగా పోరాడాలి : ఆర్ కృష్ణయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వెనుకబడిన తరగతులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం సమావేశంలో ఆయన ప్రసంగించారు. పార్లమెంట్‌లో బిసిలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్ల కోసం రాజీలేని పోరాటం చేయాలని కోరారు. బిసి బిల్లు ద్వారానే చట్టసభల్లో ప్రాధాన్యత పెరుగుతుందని, అందుకోసం ఢిల్లీ నుంచి గల్లీవరకు పోరాడాలని అన్నారు. ఈ సందర్భంగా బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్ మారేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే బిసిలకు రాజకీయాలు వుండాలన్నారు. మిగిలిన సమయంలో ఏ సమస్య వచ్చినా బిసిలంతా ఐక్యంగా వుండాలని కోరారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో బిసిల బిల్లుకు మద్దతు కూడగట్టేందుకు అన్ని పార్టీలను ఐక్యంగా ఒప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జు కృష్ణ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబిరాణి, జాతీయ బిసి సంఘం నాయకులు చెరుకుల రాజేందర్, నాయకులు హర్షద్, నీలం వెంకటేష్, అనంతయ్య, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్దరాజు రామం కుమార్తె కమల కన్నుమూత

- అంత్యక్రియల్లో పాల్గొన్న పుణ్యవతి, జ్యోతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ కమ్యూనిస్టు నేత, స్వాతంత్ర్య సమరయోధులు ఉద్దరాజు రామం-మాణిక్యాంబ కుమార్తె ఉద్దరాజు కమల(84) శనివారం రాత్రి హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆమె మృతికి సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ పుణ్యవతి, తెలంగాణ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి అంబర్‌పేటలో కమల మృతదేహానికి నివాళులు అర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆమె చిన్నతనంలో తన తల్లిదండ్రులపై నాటి కాంగ్రెస్ పాలకులు సాగించిన దమనకాండ ఫలితంగా వారితో పాటు అజ్ఞాతవాసం కారణంగా పలు ఇబ్బందులు పడ్డారు. అప్పుడు అబ్బిన అభ్యుదయ, కమ్యూనిస్టు భావజాలంతోనే తుది వరకు జీవించారు. ఆమె భర్త జివిఎస్ రాజు తుదివరకు కమ్యూనిస్టుగానే జీవించారు. రామం-మాణిక్యాంబలకు వృద్ధాప్యంలో సేవలు అందించి ఆదర్శంగానూ, రామం గారి భావాలకు వారసురాలిగానూ నిలిచారు. 1975లో అత్యవసర పరిస్థితి విధించినప్పుడు పుచ్చలపల్లి సుందరయ్య, కొరటాల తదితర సిపిఎం అగ్రనేతలకు గుంటూరులోని వారి ఇల్లు రహస్య కేంద్రంగా ఉండేది. బిడ్డలను వామపక్ష భావజాలంతో పెంచటంతో పాటు ప్రజాసంఘాలలో పని చేసేందుకు కమల ప్రోత్సహించారు. పెద్ద కుమారుడు పద్మనాభం ఎస్ఎఫ్ఐ కార్యకర్తగా, కుమార్తె శారద ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ కార్యకర్తగా, చిన్న కుమారుడు నాగార్జున టిఐఎఫ్ఆర్ ప్రొఫెసర్‌గా, ఫ్రీ సాఫ్ట్‌వేర్ ఉద్యమ జాతీయ నేతగా, అల్లుడు ఎం కోటేశ్వరరావు జర్నలిస్టుగా పని చేస్తున్నారు. కమల మృతదేహానికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. కమల మృతికి మాజీ ఎమ్మెల్యే పుతుంబాక భారతి సంతాపం తెలిపారు.

ప్రజలు తిరగబడతారు

- మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాన్ని కూడా రాజకీయం చేయాలని ప్రతిపక్ష పార్టీలు చూస్తే ప్రజలే తిరగబడి తరుముతారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో మంగళగిరిలో టిడ్కో లబ్ధిదారులు జనసేన పార్టీ నాయకులను నిలదీసి అక్కడ నుంచి వెళ్లిపోవాలని చెప్పడమే లబ్ధిదారులకు అన్ని వసతులు సమకూరాయని చెప్పడానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 40,576 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించామని తెలిపారు. డిసెంబర్ నాటికి మరో 1,10,672 ఇళ్లను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టిందని అన్నారు. మార్చినాటికి మిగిలిన 1,10,968 ఇళ్లను పూర్తిచేస్తామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా 1,43,600 మంది లబ్ధిదారులకు 300 చదరపు అడుగుల ఇంటిని కేవలం ఒక్క రూపాయికే ఈ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తుందని మంత్రి చెప్పారు. దీనివల్ల ప్రభుత్వానికి రూ.3,805 కోట్ల రూపాయల భారం పడుతుందన్నారు. రోడ్లు, కరెంటు, తాగునీరు, మురికి నీరు శుద్ధి చేయడానికి ప్లాంట్లు, డ్రైనేజీ అన్ని వసతులతో సుందరంగా ఇళ్లను తీర్చిదిద్ది లబ్ధిదారులకు అందజేస్తున్నామని చెప్పారు.

ప్రభుత్వ పరిశీలనలో వీక్లీ ఆఫ్

- పోలీసు రిక్రూట్‌మెంట్‌లో హోంగార్డులకు అవకాశం
- డిజిపి కె.రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



సమావేశంలో మాట్లాడుతున్న డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి

పోలీసు శాఖలో సిబ్బందికి వీక్లీ ఆఫ్ అమలు చేసే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని డిజిపి కె.రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల పోలీసు శాఖ అధికారులతో సమీక్షి నిర్వహించారు. అనంతరం విలేకరులతో రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. సిబ్బందికి పని ఒత్తిడి తగ్గించి, సెలవులు మంజూరు చేసేందుకు పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న 6,500 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పోలీసు రిక్రూట్‌మెంట్‌లో అర్హులైన హోంగార్డులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలు పూర్తిగా తగ్గుముఖం పట్టలేదన్నారు. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజుకు మావోయిస్టుల పేరుతో వచ్చిన బెదిరింపుల లేఖపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సారా తయారీ చేస్తున్న గ్రామాలను సర్వే చేశామని, దానిపై ఆధారపడుతున్న కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి కోసం 3,485 మందిని గుర్తించామని తెలిపారు. వారికి బిసి, ఎస్‌సి కార్పొరేషన్లు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా ఉపాధి కల్పించేలా చూస్తున్నామని చెప్పారు. సారా తయారీ, అక్రమ మద్యం రవాణా సందర్భంలో నమోదు చేసిన పీడీ యాక్ట్ కేసుల నుంచి 169 మందికి ఉపశమనం కలిగించామని తెలిపారు. నాటుసారా తయారీలో బెల్లం వ్యాపారుల పాత్రపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. అంతకుముందు పోలీసు అధికారుల జిమ్‌ను ఆయన ప్రారంభించారు. సమావేశంలో అడిషనల్ డిజిపి రవిశంకర్ అయ్యర్, డిఐజి హరికృష్ణ, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్‌పిలు జి.ఆర్ రాధిక, విద్యాసాగర్ నాయుడు పాల్గొన్నారు.



ఓవరాల్ ఛాంపియన్ విశాఖ, విజయనగరం జట్లకు ట్రోఫీ అందిస్తున్న మంత్రి ధర్మాన

ఓవరాల్ ఛాంప్ విశాఖ, విజయనగరం

- ముగిసిన రెవెన్యూ ఉద్యోగులు క్రీడ, సాంస్కృతికోత్సవాలు

ప్రజాశక్తి- ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మూడు రోజులపాటు జరిగిన ఎపి రెవెన్యూ సర్వీసు ఉద్యోగుల 6వ క్రీడా సాంస్కృతికోత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఓవరాల్ ఛాంపియన్‌గా విశాఖపట్నం, విజయనగరం జిల్లాలు నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ సభకు ఎపి ఆర్ఎస్ఎ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ రెవెన్యూ అధికారాలను మరింత బలోపేతం చేసేలా చట్టంలో మార్పులు చేయనున్నట్లు తెలిపారు. దీనిద్వారా సివిల్ కోర్టులే కాకుండా రెవెన్యూ వ్యవస్థ కూడా మరింత భూమిక పోషించబోతోందన్నారు. కొద్ది రోజుల్లో ప్రతిష్టాత్మకమైన ప్రక్రియ వందేళ్ల తర్వాత ప్రారంభం కాబోతోందని, దానిలో రెవెన్యూ శాఖ పాత్ర ప్రముఖమైనదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విచక్షణ అధికారాలు కలిగిన రెవెన్యూ శాఖ ప్రభుత్వానికి వెన్నెముక లాంటిదన్నారు. ఒత్తిడిని అధిగమించేందుకు, ఐక్యత పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని, తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ప్రముఖ షటిల్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్ మాట్లాడుతూ ఒత్తిడిని అధిగమించడంలో, సరైన నిర్ణయాలు తీసుకోవడంలో వ్యాయామం పాత్ర ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలను దినసరి చర్యల్లో భాగస్వామ్యం చేసుకోవాలని సూచించారు. గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ప్రసంగించారు. జెజి జి.రాజకుమారి, పొన్నూరు ఎమ్మెల్యే కె.వెంకటరోశయ్య, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, జె.కృష్ణమూర్తి, పారిశ్రామికవేత్త తులసి రామచంద్ర ప్రభు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం వైపు ప్రజలను మరల్చాలి

- మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్ శర్మ పిలుపు
- ముగిసిన జెవివి రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

శాస్త్రీయ దృక్పథం వైపునకు ప్రజలను మరల్చేందుకు కృషి చేయాలని మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్ శర్మ పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా కాకినాడలోని జెఎన్‌టియుకెలో రెండు రోజులపాటు జరిగిన జనవిజ్ఞాన వేదిక 17వ రాష్ట్ర ప్లీనరీ ఆదివారంతో ముగిసింది. జెవివి రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ రాహుల్ అధ్యక్షతన జరిగిన ప్లీనరీలో శర్మ పాల్గొని మాట్లాడారు. కోవిడ్ వంటి మహమ్మారిని ఎదుర్కోవడంలో సైన్స్ మాత్రమే పరిష్కారం చూపగలిగిందని అన్నారు. వ్యాక్సిన్ ఉత్పత్తిలో సైన్స్ కీలక పాత్ర వహించిందని తెలిపారు. భావజాలరంగంలో ప్రశ్నించే తత్వాన్ని ప్రజాస్వామ్య కాంక్షను విద్యార్థి దశ నుంచే అభివృద్ధి చేయాలని సూచించారు. కొందరు కుహనా మేధావులు మూఢనమ్మకాలను పనిగట్టుకుని ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, ప్రపంచ శాంతి కోసం సైన్స్ అనే నినాదాలతో జన విజ్ఞాన వేదిక కార్యకర్తలు ప్రజాసైన్స్ ఉద్యమానికి పునరంకితం కావాలని కోరారు. కోవిడ్ కాలంలో అశాస్త్రీయ భావాలు ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేసిన సంఘటనలను ఉదహరించారు. మోడీ హయాంలో శాస్త్రీయతపై దాడి మరింత పెరిగిందన్నారు. సామాన్య ప్రజానీకానికి శాస్త్ర విజ్ఞాన ఫలాలను హక్కుగా అందివ్వాలని దీనికి ఎదురవుతున్న అశాస్త్రీయ భావజాల ఆధిపత్య ధోరణిలను ప్రజాసైన్స్ కార్యకర్తలు ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం స్వావలంబనను పూర్తిగా దెబ్బతిస్తోందన్నారు. ప్రశ్నిస్తే కేసులు పెడుతున్న నేటి తరుణంలో సైన్స్ కార్యకర్తల పాత్ర ఇంకా పెరగాలన్నారు. శాస్త్ర విజ్ఞానం పట్ల, కొత్త కొత్త ఆవిష్కరణల పట్ల మరింత అవగాహన పెంచాల్సిన బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, జెవివి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ స్టాలిన్, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డాక్టర్ చల్లా రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి రాధా రాణి పాల్గొన్నారు.



జెవివి ప్లీనంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి శర్మ

ఎన్‌టిఆర్ విగ్రహాన్ని అవమానించిన వారిపై చర్యలు

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఉప్పలపాడులో ఎన్‌టిఆర్ విగ్రహానికి చెప్పులు కట్టిన వారిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డిమాండ్ చేశారు. ఈ చర్యను ఖండిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహనీయులను గౌరవించుకునే మంచి సంస్కృతికి వైసిపి మొదటి నుంచి దూరంగానే ఉంటుందని విమర్శించారు. సంస్థలకు ఉన్న నాయకుల పేర్ల మార్పు, విగ్రహాల తొలగింపు అనేది ప్రభుత్వమే చేస్తుండడంతో ఆ పార్టీ క్యాడర్ కూడా అదే దారిలో వెళ్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వ ఉదాసీనత వల్లే ఎన్‌టిఆర్‌కు తరచూ అవమానం జరుగుతోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు మరో ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు.



పోస్టర్ విడుదల చేసిన పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి రోజా

పెద్ద ఎత్తున జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు

- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి రోజా

ప్రజాశక్తి- తిరుపతిటౌన్

జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు పెద్దఎత్తున జరుగుతాయని, క్రీడాశాఖ తరపున వివిధ క్రీడల పోటీలు జోనల్ రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడా శాఖ మంత్రి ఆర్‌కె రోజా అన్నారు. తిరుపతిలోని బ్లిస్ హోటల్‌లో రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి వారిచే జరిగే ఈ సంబరాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోనల్‌స్థాయి పోటీలు తిరుపతి, గుంటూరు, రాజమండ్రి, విశాఖపట్నం కేంద్రంగా రాష్ట్రస్థాయి పోటీలు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో డిసెంబర్ 19, 20 తేదీలలో నిర్వహిస్తామని తెలిపారు. తిరుపతి జోన్‌కు సంబంధించి నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్‌ఆర్ కడప, శ్రీసత్యసాయి, అనంతపురం, నంద్యాల, కర్నూలు జిల్లాల కళాకారులకు మహతి కళాక్షేత్రంలో ఈ నెల 19, 20, 21 తేదీలలో ఉదయం పది గంటల నుంచి పోటీలు జరుగుతాయన్నారు. ప్రతివిభాగంలో జోనల్ స్థాయి గ్రూపు విజేతలకు రూ.25,000లు సోలోకి రూ.పది వేలు, రాష్ట్రస్థాయి గ్రూపు విజేతలకు లక్ష రూపాయలు, సోలోకి రూ.50వేలు, ముఖ్యమంత్రి జన్మదినాన అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల కళాకారులు ఈ నెల 15వ తేదీలోపు పేరు నమోదు చేసుకోవాలని కోరారు. పోటీలు నిర్వహించేందుకు రూ.50 లక్షలు కేటాయించి క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు జిల్లా జోనల్ రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తామని గెలిచిన క్రీడాకారులకు మంచి బహుమతులే కాకుండా జగనన్న పుట్టినరోజు వేడుకలలో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఇడి, రీజినల్ డైరెక్టర్ పర్యాటకశాఖ రమణ ప్రసాద్, జిల్లా పర్యాటకశాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి సెట్విన్ సీఈవో మురళి పాల్గొన్నారు.

'పోలవరం' పనులు పునఃప్రారంభం

ప్రాజెక్టు పరిశీలించిన మంత్రి అంబటి రాంబాబు


పోలవరం ప్రాజెక్టు పరిశీలించిన రాష్ట్ర భారీ జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - పోలవరం (ఏలూరు జిల్లా)

గోదావరి వరద ప్రభావం పూర్తిస్థాయిలో తగినట్లుగా భావిస్తూ పోలవరం ప్రాజెక్ట్ పనులు పునఃప్రారంభిస్తున్నామని రాష్ట్ర భారీ జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్ట్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. శనివారం రాత్రి పోలవరం ప్రాజెక్టుకు చేరుకున్న మంత్రి రాత్రి ప్రాజెక్టు అతిథి గృహంలో బస చేశారు. ఉదయం హిల్‌వ్యూ ప్రాంతానికి వెళ్లి అక్కడి స్పిల్‌వే పనులతో పాటు పాజెక్టుకు సంబంధించి జరుగుతున్న ఇతర పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరద ప్రభావం తగ్గడంతో పనులు పునఃప్రారంభిస్తున్నామని తెలిపారు. ముందుగా దిగువ కాపర్‌డ్యామ్ పనులు ప్రారంభించామని చెప్పారు. వరద జలాల నీటిమట్టం పూర్తిస్థాయిలో తగ్గిన తర్వాత ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య ఉన్న, డయాఫ్రం వాల్ చుట్టూ ఉన్న నీటిని తొలగించామని, నేషనల్ హైడ్రోపవర్ కార్పొరేషన్ అధికారులు పరీక్షలు నిర్వహిస్తారని, వారి సూచనల మేరకు డయాఫ్రం వాల్ పునఃనిర్మించాలా లేదా పాత దాని మీదే ఎర్త్ కం రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మించాలా అనే విషయాలపై చర్చిస్తామని తెలిపారు. అప్పటివరకూ దిగువ కాపర్ డ్యామ్ పనులు పూర్తిచేసి, వర్కింగ్ ప్లేస్‌ని పూర్తి చేస్తామని చెప్పారు. కాపర్ డ్యాముల నిర్మాణం పూర్తి కాకుండా డయాఫ్రంవాల్ నిర్మించడం చారిత్రాత్మక తప్పిదమని, ఆ సమస్యను అధిగమించడానికి ఎక్కువ సమయం పట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయని, సాధ్యమైనంత త్వరగా డయాఫ్రంవాల్ స్థితిగతులు అంచనా వేస్తామన్నారు. స్పిల్‌వే నిర్మాణం పూర్తయిందని చెప్పారు. ఈ ఏడాది ఎర్త్ కం రాక్‌ఫిల్ డ్యామ్ పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంత్రి వెంట పోలవరం ప్రాజెక్ట్ ఎస్ఇ నరసింహమూర్తి, పోలవరం ఎస్ఐ పవన్ కుమార్, ఇతర ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

ఒక్క దరఖాస్తుకూ పరిష్కారం కరువు

- ముందుకెళ్లని సాదాబైనామాల క్రమబద్ధీకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సాదాబైనామాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గడువును పెంచుతూ రైతులు దరఖాస్తులు చేసుకునేందుకు వీలుగా మార్గదర్శకాలు విడుదల చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిష్కారం కావడం లేదు. రెవెన్యూ అధికారులు భారీ సంఖ్యలో దరఖాస్తులను తిరస్కరించడమో, పెండింగ్‌లో పెట్టడమో చేస్తుండటంతో తమ భూములు సాదాబైనామా క్రమబద్ధీకరణకు నోచుకోవడం లేదని సన్న చిన్న కారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది అక్టోబరు నుంచి నవంబరు మొదటి వారం వరకు ఒక్క దరకాస్తు కూడా క్రమబద్ధీకరణకు నోచుకోలేదని రెవెన్యూ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ 30 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 163 దరకాస్తులు ప్రభుత్వానికి అందాయి. వాటిలో ఏలూరు 7, కర్నూలు 1, ఎన్‌టిఆర్ 24, ప్రకాశం 7, నెల్లూరు 30, విజయనగరం 7, పశ్చిమగోదావరి 2, తిరుపతి 84, కాకినాడ నుంచి ఒక దరఖాస్తు క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వానికి రైతులు వినతులు సమర్పించారు.


ఎన్ఎఒబి నిర్వాసితులు ఐక్యంగా పోరాడాలి

చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకుడు గంటా శ్రీరామ్

ప్రజాశక్తి- రాంబిల్లి, విశాఖ

ఉపాధి, చేపల వేట, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వాడ నర్సాపురం గ్రామం వద్ద గల నేవల్ ఆల్టర్నేటివ్ ఆపరేటింగ్ బేస్ (ఎన్ఎఒబి) మెయిన్ గేటు వద్ద ఎన్ఎఒబి నిర్వాసితులు చేపట్టిన ఆందోళన ఆదివారంనాటికి 14వ రోజుకు చేరింది. నిర్వాసితులు ఎన్ఎఒబి మెయిన్ గేట్ ముందు రోడ్డుపై నిర్వాసితులు బైఠాయించి ఆందోళన చేశారు. దీక్షా శిబిరాన్ని చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకుడు గంటా శ్రీరామ్ సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలపై నిర్వాసితులు ఐక్యంగా పోరాడాలని కోరారు.

నిర్వాసితుల నుంచి భూములు, ఇళ్లు, గ్రామాలను తీసుకొని నేటికి 17 ఏళ్లు అవుతున్నా సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగదన్నారు. నేవీ ప్రాజెక్ట్ దేశానికి ఎంతో అవసరమని తెలిపారు. దీని కోసం సర్వం త్యాగం చేసిన మత్స్యకారులకు, సన్న చిన్నకారు రైతులకు, గొర్రెల పెంపకందారులకు, గీత కార్మికులకు, చేనేత కార్మికులకు, రజక వృత్తిదారులకు, వ్యవసాయ కూలీలకు భూ సేకరణ చట్టం-2013 ప్రకారం న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశంలో ఈ సమస్యలపై ప్రశ్నిస్తావన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, నేవీ అధికారులు, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని నిర్వాసితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు, ఎనిమిది గ్రామాల పెద్దలు, జెఎసి నాయకులు పాల్గొన్నారు.


నిర్వాసితులనుద్దేశించి మాట్లాడుతున్న చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకుడు గంటా శ్రీరామ్

విశాఖలో ఇంధన సామర్థ్య పెట్టుబడుల సదస్సు

- బిఇఇ డైరెక్టర్ జనరల్ అభయ్ బాక్రే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంధన సామర్థ్య పెట్టుబడుల సదస్సు (ఇన్వెస్ట్‌మెంట్ బజార్)ను విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు బిఇఇ డైరెక్టర్ జనరల్ అభయ్ బాక్రే తెలిపారు. పరిశ్రమలకు ఆర్థిక సహకారం అందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఎపిఎస్‌ఈసిఎం)తో కలిసి ఈ నెల 23న కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సుపై రాష్ట్ర ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, ఎపిఎస్‌ఇసిఎం అధికారులతో కలిసి ఆదివారం వెబినార్ నిర్వహించారు. విశాఖలో గత ఏడాది నిర్వహించిన ఇంధన సామర్థ్య పెట్టుబడుల సదస్సుకు మంచి స్పందన రావడంతో మళ్లీ విశాఖనే ఎంపిక చేసినట్లు అభయ్ బాక్రే తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన సదస్సుల్లో రూ.300 కోట్ల ప్రాజెక్టులను గుర్తించామన్నారు. సదస్సు నిర్వహణకు తొలిదశలో ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాలను ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ వేదికపై పరిశ్రమలు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కలిసి ఇంధన సామర్థ్య పెట్టుబడులకు అవకాశమున్న ప్రాజెక్టులను గుర్తిస్తాయని తెలిపారు. విజయానంద్ మాట్లాడుతూ ఇంధన సామర్థ్య ప్రాజెక్టులను పరిశీలించేందుకు బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో కలిసి ఒక ప్రత్యేక కమిటీని ఎపిఎస్‌ఇసిఎం ఏర్పాటు చేసిందని చెప్పారు. ఇంధన సామర్థ్య ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పరిశ్రమల నుంచి ఎపిఎస్‌ఇసిఎంకు ప్రతిపాదనలు వస్తే అవసరమైన సాంకేతిక ప్రక్రియ నిర్వహించి, ఆర్థిక సంస్థలను పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బ్యాంకులతో ఇప్పటికే ఫైనాన్షియల్ కమిటీని ఎపిఎస్‌ఇసిఎం ఏర్పాటు చేసిందన్నారు. ఇంధన సామర్థ్య పెట్టుబడుల సదస్సు విజయవంతం అయ్యేందుకు తగిన చర్యలు, ఏర్పాట్లు చేయాలని ఎస్‌ఇసిఎం అధికారులను ఆదేశించారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డాక్టర్ దానేటి శ్రీధర్

పోరాటాల పురిటిగడ్డ ఉత్తరాంధ్ర

- డాక్టర్ దానేటి శ్రీధర్
- 'వీర గున్నమ్మ' ట్రైలర్ విడుదల

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జమిందారీ వ్యతిరేక పోరాటంలో ప్రాణాలర్పించిన వీరనారి సాసుమాను గున్నమ్మ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కించిన 'వీర గున్నమ్మ' చిత్రం ట్రైలర్ విడుదలైంది. శ్రీకాకుళంలోని ఒక హోటల్‌లో ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్, పోస్టర్‌ను ప్రముఖ వైద్య నిపుణులు దానేటి శ్రీధర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాల పురిటిగడ్డ ఉత్తరాంధ్ర అని, ఎందరో త్యాగధనుల వీరోచిత పోరాటాల చరిత్ర మరుగున పడిందని తెలిపారు. అటువంటి వాటిని ప్రస్తుత తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందులో భాగంగా వీరగున్నమ్మ చిత్రాన్ని తెరకెక్కించడం అభినందనీయమని తెలిపారు. మందస జమిందారీ వ్యతిరేక పోరాటంలో తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి నిలిచి ప్రాణాలర్పించిన గున్నమ్మ పోరాటం చిరస్మరణీయమన్నారు. ఈ సినిమాను ప్రజలు ఆదరించాలని కోరారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ హనుమంతు లజపతిరాయ్ మాట్లాడుతూ జిల్లాలో పోరాట యోధుల చరిత్రను నేటి తరానికి అందించాలన్న చిత్ర యూనిట్ సంకల్పం గొప్పదన్నారు. తాను ఈ చిత్రంలో జమిందారీ పాత్రను పోషించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ చిత్రాన్ని డిసెంబరు రెండో వారంలో విడుదల చేయనున్నట్లు చిత్ర దర్శక, నిర్మాత గూన అప్పారావు చెప్పారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ మాజీ సిఇఒ సురంగి మోహనరావు, సిపిఐ రాష్ట్ర నాయకులు సనపల నర్సింహులు, లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు బాడాన దేవభూషణరావు పాల్గొన్నారు.

స్పిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం

- ఇద్దరికి గాయాలు
- సుమారు రూ.తొమ్మిది కోట్ల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - దెందులూరు (ఏలూరు జిల్లా)

ఏలూరు జిల్లా దెందులూరు మండలం ముప్పవరం జాతీయ రహదారి పక్కన ఉన్న స్పిన్నింగ్ మిల్లులో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. మిల్లు మొత్తం అగ్నికి ఆహుతైంది. ఈ సంఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. సుమారు రూ.తొమ్మిది కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముప్పవరం పరిధిలో యర్రా స్పిన్నర్స్ పేరుతో గత కొంత కాలంగా సుమారు 40 మంది కార్మికులతో ఈ మిల్లును నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం పది గంటల ప్రాంతంలో మిల్లులోని రెండో షట్టర్ వద్ద షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించి మిల్లు తగులబడింది. ఆ సమయంలో పని చేస్తున్న కార్మికులు బయటకు పరుగులు తీశారు. భీమడోలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ప్రమాదం స్థాయి తీవ్రంగా ఉండటంతో భీమడోలు ఫైరింజన్‌తో పాటు ఏలూరు నుంచి రెండు ఫైరింజన్లు, భీమడోలు నుంచి ఒక ఫైరింజన్, తాడేపల్లిగూడెం నుంచి ఒక ఫైరింజన్ సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. ఈ ప్రమాదంలో మిల్లు మేనేజింగ్ డెరెక్టర్ శ్రీనివాసరావు, ఫిట్టర్ జె తిరుమలరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వారికి ప్రథమ చికిత్స అందించారు. దెందులూరు తహశీల్దార్ ఎన్‌వి నాంచారయ్య మిల్లును పరిశీలించి వివరాలను ఉన్నతాధికారులకు తెలిపారు. ఈ ప్రమాదంలో మిల్లులోని యంత్రాలు, ముడి సరుకులు పూర్తిగా కాలిపోయాయి. వీటి విలువ సుమారు రూ.తొమ్మిది కోట్ల నుంచి రూ.12 కోట్ల వరకూ ఉండొచ్చని అధికారులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ మిల్లు పనిచేయడం వల్ల కార్మిక శాఖ అధికారులు విచారణ చేపడుతున్నట్లు తెలిసింది.

డిఎస్‌పి చైతన్యపై చర్యలు : వర్ల రామయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తాడిపత్రి డిఎస్‌పి చైతన్యను వెంటనే సస్పెండ్ చేయాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు డిజిపికి ఆదివారం లేఖ రాశారు. చైతన్య అధికార పార్టీ ఎమ్మెల్యే కేతిరెడ్డితో ఉంటూ టిడిపి నాయకులు, సానుభూతిపరులపై తప్పుడు కేసులు బనాయిస్తూ, వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారని విమర్శించారు. చైతన్యపై శాఖాపరమైన విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాందోళనతో ఎట్టకేలకు దిగివచ్చిన ప్రభుత్వం

సూర్యలంక బీచ్ మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం

బాధితుల కుటుంబాలకు సిపిఎం రాష్ట్ర నేత సిహెచ్ బాబూరావు పరామర్శ

ప్రజాశక్తి - విజయవాడ

సూర్యలంక బీచ్‌లో అక్టోబర్ నాలుగున ప్రమాదవశాత్తూ మరణించిన విజయవాడ శాంతినగర్, అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు, యువకుల కుటుంబ సభ్యులకు రూ.మూడు లక్షల చొప్పున మొత్తం రూ.18 లక్షలను ఆదివారం అధికారులు అందజేశారు. ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధితులు, స్థానికులు వివిధ రూపాల్లో ఆందోళన చేస్తూ వచ్చారు. వారికి సిపిఎం, ఇతర ప్రజా సంఘాల వారు అండగా నిలిచారు. ఈ ఘటనపై స్థానిక శాసనసభ్యులు, వైసిపి ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించారు. న్యాయం కోరుతూ ఆందోళనలు చేసిన బాధితుల కుటుంబ సభ్యులు, సిపిఎం, ప్రజా సంఘాల నేతలపై మూడు సందర్భాల్లో పోలీసులతో అక్రమ కేసులు పెట్టించారు. విజయవాడలో నేతలను, బాధిత కుటుంబ సభ్యులను అరెస్టు చేసి సుదూర ప్రాంతంలో ఉన్న నందిగామ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొందరు కుటుంబ సభ్యులను మృతుల అంత్యక్రియల్లోనూ పాల్గొనే అవకాశం లేకుండా అరెస్టు చేశారు. అయినా సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు మంత్రులు, అధికారులు, ప్రభుత్వ యంత్రాంగాన్ని కలిసి పదేపదే విజ్ఞాపనలు అందజేసి ఆందోళన కొనసాగించారు. ఈ నేపథ్యంలో ఒక్కో కుటుంబానికి రూ.మూడు లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించింది.


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సిహెచ్ బాబూరావు తదితరులు

బాధిత కుటుంబాలను కలిసి ధైర్యం చెప్పిన సిపిఎం నేతలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, పలువురు సిపిఎం, ప్రజాసంఘాల నేతలు ఆదివారం బాధితుల కుటుంబ సభ్యులను కలిసి మనోధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ బీచ్‌లో ఆరుగురు మృతి చెందడం అందరినీ కలిచి వేసిందన్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం దిగి వచ్చిందని, ప్రజల ఆందోళనకు ప్రభుత్వం తల ఒగ్గక తప్పలేదని అన్నారు. ఒక్కొక్కరికీ రూ.పది లక్షల సాయం కోరామని, బీమా పథకం కింద రూ.ఐదు లక్షలు రావాల్సి ఉండగా, రూ.మూడు లక్షలతో సరిపెట్టారని తెలిపారు. బాబురావుతో పాటు సిపిఎం, కార్మిక, మహిళ, యువజన సంఘాల నేతలు సిహెచ్ శ్రీనివాస్, బొంగు రాంబాబు, విజయ, దేవి కుమారి, అరుణ, శివ, శ్రీరామ్ ఉన్నారు.

స్వప్రయోజనాల కోసం రాష్ట్ర భవిష్యత్తు తాకట్టు

- అవకాశవాద రాజకీయాలకు కేంద్రమైన మోడీ సభ
- నిరసన తెలిపిన సిపిఎం, సిపిఐ నేతలపై అక్రమ కేసులు : గంగారావు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ, విశాఖ

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తన స్వప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టారని సిపిఎం విశాఖ నగర కార్యదర్శివర్గ సభ్యులు, సిపిఎం జివిఎంసి ఫ్లోర్ లీడర్ బి.గంగారావు అన్నారు. విశాఖ మద్దిలపాలెంలోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి స్వప్రయోజనాల కోసమే విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై మోడీని నిలదీయలేకపోయారని విమర్శించారు. విశాఖ రైల్వేజోన్, పోలవరం, ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధి, ఇతర విభజన చట్టంలోని అంశాలను స్పష్టంగా పేర్కొనకుండా రాష్ట్ర ప్రయోజనాలను ముఖ్యమంత్రి దెబ్బతీశారని విమర్శించారు. అడుగడుగునా ప్రధాని మోడీకి లొంగుబాటు ప్రదర్శించారన్నారు. ప్రధాని మోడీ రాష్ట్ర సమస్యలపై ప్రస్తావన చేయకుండా ఆంధ్ర రాష్ట్రానికి మరోసారి ద్రోహం చేశారని విమర్శించారు. తెలంగాణాలో టిఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి కాలరీస్ ప్రైవేటీకరణపై మోడీ ప్రభుత్వాన్ని సవాల్ చేసిందని, శనివారం జరిగిన మోడీ సభను కూడా బహిష్కరించడంతో సింగరేణి కాలరీస్‌ను ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని సభలో ప్రకటించాల్సి వచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి రైల్వేజోన్, విభజన చట్టంలోని అంశాల అమలుపై అనివార్యంగా ప్రధానమంత్రి మాట్లాడేవారన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై వైసిపి ప్రభుత్వం ముసుగు తొలగిపోయిందని విమర్శించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆఘమేఘాల మీద మోడీతో చర్చలు జరిపి ఆయన పాలనకు కితాబు ఇచ్చి ప్రసన్నం చేసుకున్నారని పేర్కొన్నారు. కనీసం విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని మోడీ వద్ద ప్రస్తావన కూడా చేయకుండా బిజెపితో పొత్తుకోసం వెంపర్లాడటం సిగ్గుచేటన్నారు. మోడీ సభతో బిజెపి, వైసిపి, టిడిపి, జనసేన పార్టీల అవకాశవాద రాజకీయాలు మరొకసారి బహిర్గతమయ్యాయని పేర్కొన్నారు. సిపిఎం విశాఖ నగర కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ అక్రమ కేసులన్నింటినీ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం విశాఖ నగర కార్యదర్శివర్గ సభ్యులు జగన్ పాల్గొన్నారు.

భార్యను చంపి భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి - నౌపడ (శ్రీకాకుళం)

భార్యను దారుణంగా హత్య చేసి, భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన శ్రీకాకుళం జిల్లా నౌపడలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి స్థానికుల తెలిపిన కథనం ప్రకారం... సంతబొమ్మాళి మండలం జగన్నాథపురానికి చెందిన దాసరి సింహాద్రి (60), ఉమ (50) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ధర్మారావు ఉన్నారు. కుమార్తెలకు వివాహమై వెళ్లిపోగా, కుమారుడు ఖమ్మం జిల్లాలో జెసిబి ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. భార్యాభర్తలు స్వగ్రామంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సింహాద్రి మద్యానికి బానిసై ఉమతో నిత్యం గొడవలు పడుతూ ఉండేవాడు. శనివారం రాత్రి మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. భార్య నిద్రపోయాక అర్ధరాత్రి చాకుతో గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఎంతసేపటికీ ఉమ బయటకు రాకపోవడంతో స్థానికులు వెళ్లి చూడగా ఇద్దరూ విగతజీవులుగా కనిపించారు. నౌపడ సర్పంచ్ భర్త పి.రవికుమార్‌రెడ్డి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో టెక్కలి సిఐ చంద్రమౌళి, నౌపడ ఎస్ఐ మహమ్మద్ అలీ, తహశీల్దార్ చలమయ్య సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.



" సాహిత్యం రాజకీయాలకు
అతీతంగా ఉండాలని ఎవరన్నా అంటే-
వాళ్లు మోసపుచ్చేవాళ్లో,
మోసపోయేవాళ్లో అయి ఉంటారు."

- కొడవటిగంటి కుటుంబరావు



నిగ్గదీసి అడుగు

సిగ్గు లేదు.. శరం లేదు
నోటిలోని మాట తప్ప
నిలదీసే దమ్ములేదు!
భయం మాటున దాగిన
బడా చోర్ల బాగోతం బయటపడింది
నోటికి తాళం వేసి గాంభీర్యం గర్జన


దగా పడ్డ తెలుగు తల్లి బిడ్డలారా
తెగువ చూపి కదలండి బిర బిర
వడి వడిగా అడుగులేసి కదలండి

నీ సత్తువ.. నీ తెగువ.. నీ ధైర్యం
నెత్తురు మండే సూరీడల్లే తెగ పడు
ఎగసిపడే సముద్రమల్లే తిరగబడు

నీ తోడుగా నీకండగ నీ వెంటే..
నీతోనే ఉందొయ్ ..ఎర్రని జెండా
భయం వద్దు.. బెరుకు వద్దు

పద పద పద పద నిలదీద్దాం
నీ ఓటుతో గద్దెనెక్కిన నేతలను
నిగ్గదీసి అడుగుదాం పద పద పద
మేమున్నాం... మేమున్నాం.. నీ వెంటే
మేమున్నాం.. పాలకుల పని పట్టగ
పద పద పద పద జర జర జరనడు!

- రెడ్డి శంకరరావు
94943 33511



ప్రొఫెషనల్ జలసీ!

పక్కవాడి ప్రతిభను
మనసారా మెచ్చుకోలేని
మానసిక అవిటితనంతో
మేధావులు బాధపడుతున్నారు

ప్రాంతీయత ప్రతిభను వెక్కిరిస్తోంది
కులం, వర్గం, రాజకీయం ముందు
మోకరిల్లుతోంది
నిరసనలు, నినాదాలు రాజీపడ్తున్నాయి
ఉద్యమాలు నిర్బంధంలో నీరసపడి
పక్కదారి పడ్తున్నాయి
సాహిత్య కారులు అనధికార
శాసన కర్తలన్నదెవరు?
వారు పాలకపక్షానికి స్వామి భక్తులు!

నోరు నవ్వుతోంది
నొసలు వెక్కిరిస్తోంది
ప్రొఫెషనల్ జలసీ కంటికి కన్పించదు
ప్రొఫెసర్లైనా ఇందుకు మినహాయింపు కాదు
తన దాకా వేస్తే అందరూ మార్క్సు
మేనమామలే
అంబేద్కర్‌కు అన్నదమ్ములే!

చింతించకు కవీ!
ఓట్ల రాజకీయంలో ప్రతిభా మూర్తులంతా
నిరాయుధులూ, నిస్సహాయులే
అవకాశవాదులంతా పాలక వర్గానికి
దగ్గరి చుట్టాలే!
సొంత లాభమే సేవా భావమైన చోట
పట్టు విద్యా ప్రవీణులకే అవార్డులైనా రివార్డులైనా
'నీ వాణ్ణే నువు తిట్టకపోతే తెలుగు వాడివే కాదు'
అప్పు డెప్పుడో కొసరాజు రాసిన పాట
గుర్తుకొస్తోంది నాకు.

- డా.రాధేయ



సారొచ్చారు!

పెద్ద దేవుడు వస్తుంటే
పూనకాలు ఢంకాలై కదిలాయి
సారు మెప్పు కోసం
నడవలేని కాళ్ళు కోళ్లలా కలియ తిరిగాయి

రాష్ట్రంపై
ఏ వరాల జల్లులో కురిసి మురిపిస్తాయని
ఆశ పడుతుంటే
చిరు జల్లులు పక్కున నవ్వి
చెమటల్ని తుడిచాయి!

సారు రాకడ ఉనికి కోసం
ఊయల పాటలానే ఉంది
ఉక్కపోతల నడుమ
గంధం పూతలా ఉంది

జరిగింది ఏదీ లేదు
ఒరిగింది ఏమీ లేదు
ప్రజాధనం వొలికిపోయే ఆర్భాటం తప్ప
ఆవగింజంత సాయం లేదు
అచ్చేదిన్ అంటూ ఊక దంపుడు

సమస్యలు కోకొల్లలు ఉన్నా
చూపులు పొత్తులపై నిలుపుతూ
కళ్లుండీ కభోది ఆటను ఆడి
కొత్త కసరత్తుల్ని చక్కగా మలిచారు

సారొచ్చారు...,
సమస్యలకు ప్రశ్న మార్కులా నిలిచారు...

- మహబూబ్ బాషా చిల్లెం
9502000415

'ఘంటసాల' నాటక ప్రదర్శన : కొన్ని సూచనలు



రంగస్థలం

ఇది గానగంధర్వుడు ఘంటసాల శతజయంతి సంవత్సరం. ఆయన పాడిన భక్తి గీతాలు, ప్రేమ గీతాలు, విరహ గీతాలు యుగళగీతాలు, పద్యాలు ప్రైవేటు రికార్డులు (దేశభక్తి, లలిత) ఇప్పటికీ తెలుగు నేలపై ఎక్కడో ఒక చోట వినిపిస్తూనే ఉన్నాయి. ఆయన గానకళను అమితంగా ఆరాధించే ఎందరి గుండెల్లోనో కొలువై ఉన్న సంగీత మాధుర్య పాటల తేనె పట్టు.

గతంలో ఆయన ఆరాధకులు, వారి కుటుంబ సభ్యులు, ఆయన జీవితం గురించి, విజయనగరంలో సంగీత విద్యను అభ్యసించిన రోజుల మొదలుకొని భగవద్గీత గానం వరకు.. ఎన్నో మధుర తలపులు పలవరించి, పులకరించి మైమరపింపచేశారు. ఆ కోవలోనిదే ఇటీవలి భాస్కర సత్య జగదీష్, ఘంటసాల జీవిత చరిత్రపై రచించిన పుస్తకం. ఆయనే ఇంకొక అడుగు ముందుకు వేసి సురభి కుటుంబం చేత ఆ కథను నాటకంగా ప్రదర్శింంచారు. ఘంటసాల జీవిత చరిత్రను వంద నిమిషాల రంగస్థల నాటకంగా మలిచి, ఇప్పటికి వరంగల్, కాకినాడ గుంటూరులో ప్రదర్శించారు. ఈనెల 2 నుంచి 6 వరకు గుంటూరు ఎల్వీఆర్ క్లబ్ అండ్ రీడింగ్ రూమ్ ప్రాంగణంలోని బహిరంగ వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో మొదటి రోజు ఘంటసాల నాటకాన్ని ప్రదర్శించారు.

ఈ నాటకం ఘంటసాల తన విజయ నగర గురువులను కలిసి అక్కడ కుదురుకున్న ఘట్టంతో ప్రారంభమవుతుంది. నేపథ్యంలో వ్యాఖ్యానం, సన్నివేశ సందర్భాలను సమన్వయ పరుస్తూ, ఆయా సందర్భాలకు ఘంటసాల గాన గుబాళింపు పరిమళాలను అద్దుతూ, ఆయన జీవిత చరమాంకం వరకు దృశ్య శ్రవ్య మాధ్యమంగా ప్రదర్శించారు, సురభి సంతోష్. ఘంటసాల వారిని తనపై ఆవహింప చేసుకుని ఆహార్య ఆంగిక అభినయాలతో రూపుమాసిపోని ఆయన వ్యక్తిత్వాన్ని ప్రేక్షకుల కళ్ళ ముందు నిలిపారు. ఘంటసాల నాటక విజయానికి యధాశక్తి కృషి చేశారు. ఈ నాటక రంగస్థల బయోపిక్ మంచి చెడ్డలను ఘంటసాల, సురభి సమాజ అభిమానిగా చర్చించే ప్రయత్నం ఈ వ్యాస పరమార్థం.

తన గురువుల సమక్షంలో, ద్వారం వారు వాయులీనంపై సహకరిస్తుండగా, కచేరితో నాటకం నడక వేగాన్ని అందుకుంటుంది. స్వాతంత్రోద్యమ సమరశీల ఘట్టాలలో ఘంటసాల 'స్వాతంత్ర్యమె నా జన్మహక్కని... చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా!' వంటి పాటలు పద్యాల నేపథ్యంలో సాగుతాయి. ఘంటసాల, హిందుస్తానీ గాత్ర మాంత్రికుడు ఉస్తాద్ బడే గులాం అలీ ఖాన్ కు ఆతిథ్యం ఇవ్వడం, 1962 చైనాతో యుద్ధ సమయంలో ఎన్టీఆర్‌తో కలిసి దేశ రక్షణ నిధి కోసం విరాళాలు సేకరించడం, లతా మంగేష్కర్ సమక్షంలో పాడటం ఆమెతో పాటించడం, జాషువా పద్యాలను ఆయనను కూర్చోబెట్టి వినిపించడం, కాసు బ్రహ్మానందరెడ్డి, నందమూరి, అక్కినేనిలతో వేదికపై సత్కరింపబడటం, ఘంటసాల తన జీవిత చరమాంకంలో ఆయన పడ్డ వేదన వంటి ఘట్టాలను స్మరింప చేస్తూ, స్ఫురింప చేస్తూ సాగుతుంది.

ఈ సందర్భంగా నాటకం ప్రదర్శించిన తీరును విమర్శక సహృదయంతో కొన్ని విషయాలను, ఈ నాటకం తదుపరి ప్రదర్శనలలో సవరించుకోతగిన వాటిని ప్రస్తావిస్తాను. అప్పుడెప్పుడో బీ.వీ.కారంత్, సురభి వారి నాటక ప్రదర్శనలను తిలకించి, ఎన్ఎస్డి శిక్షక బోధకులచే వారికి, నట శిక్షణా శిబిరం ఒకటి నిర్వహించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటున్నాను. ఆ తర్వాత ఒక సాంఘిక ఆత్మకథాత్మక నాటకాన్ని ప్రదర్శించడం ఇదే ప్రథమంగా భావిస్తూ చేస్తున్న ఆలోకనం ఇది.

ఘంటసాల గాన మాధుర్యాన్ని చవిచూసిన వారు జీవితాంతం ఆ మాధుర్యానుభూతులను మర్చిపోరు. ఈ నాటకం ఆయన పాటల పాటకచేరి కాకపోయినా, టైటిల్ వినగానే వేదిక ముందు ప్రేక్షకులు రూపక రసాస్వాదనకు సిద్ధమైపోయారు. వ్యాఖ్యాత ఉపోద్ఘాతం, ప్రార్థనతో ప్రారంభమైన ఈ నాటకం ప్రార్థన మరింత సభక్తిద్యోతకంగా, మదువుగా జరిగి ఉంటే వ్యాఖ్యాత స్వరం నడిపించి ఉంటే బాగుండేది. ఘంటసాల గురువులుగా నటించిన వారి వాచిక దోషాలు, ఆయా సందర్భాల్లో కావల్సినంత మృదుత్వం స్వరమాధుర్యం చెవిన పడలేదు. నేపథ్యంలో పాటల రికార్డింగ్, ప్రసార నాణ్యత లోపించడం ఒక అవరోధం. ఆయా సన్నివేశాలకు మరింత ప్రాణ ప్రతిష్ట చేయాలంటే, ఘంటసాల అభిమాన గాయకులెందరో, ఆయనను అనుకరించి పాడేవారు ఉన్నారు. వారితో గాత్ర వైవిధ్యాన్ని స్ఫురింపచేసే విధంగా నేపథ్యగానం సమకూరిస్తే బాగుంటుందనిపించింది.

లైట్స్ ఆఫ్.. ఆన్ .. అనే మాటలు సన్నివేశ తాదాత్మ్యాన్ని భంగపరిచాయి. స్వాతంత్ర్యమే మా జన్మ హక్కు అనే పాటలో పాల్గొన్న బృందం, ఆంగికంపై ఏమాత్రం అవగాహన లేకుండా యాంత్రికంగా చేతులూపుతూ జై కొట్టడం- దేశభక్తి రసోత్పత్తికి విఘాతం. ఇలాంటి సన్నివేశాలను ఒద్దికల సమయంలో దర్శకుడు నటీనటుల ముందుండి, సన్నివేశం ఎలా వస్తోందో, ఇంకా ఎలాంటి సూచనలు ఇవ్వాలో గమనించి సరి చేస్తే బాగుంటుంది. బాలాంత్రపు రజనీకాంతరావు పాత్రధారి అవసరానికి మించిన వినయ విధేయతలు ప్రదర్శించగా నందమూరిగా నటించిన నటుడి ఆంగికం ఓవర్‌గా అనిపించింది.

ఘంటసాల పాత్రధారి ఒక సన్నివేశంలో తోలేటి పార్థివ దేహంపై తన శాలువా కప్పడం ఉండాల్సిన విధంగా లేదు. నిండు దు్ఃఖాన్ని వినిపించే ధోరణి ఔచిత్యవంతంగా కనిపించలేదు. తోలేటి వారి అర్ధాంగి పాత్రధారిణి, శవం దగ్గర ఏడుపు శృతిమించింది. జీవిత చక్రం పాటల (స్టూడియో) రికార్డింగ్ సందర్భంలో సంగీత దర్శకుడి వాచకం, ఘంటసాల సతీమణిగా నటించిన నటి వాచికాభినయంలో ఇంకా ఎంతో సాత్వికత అవసరం. వైద్యుడు ఘంటసాల శయ్య పక్కన కూర్చుండి మాట్లాడిన తీరు సవరించుకోవాలి. ఎంత గొప్ప వారైనా ఘంటసాల వారి ముందు ఇసుమంతైనా అవిధేయాన్ని ప్రదర్శించి ఉండరు. లతా మంగేష్ అని కాకుండా మంగేష్కర్ అని సంబోధించాల్సిందే ఎవరైనా.

ఈ సూచనలను సహృదయంతో పున:సమీక్షించు కొని అవసరమైన మార్పులు చేర్పులు చేసుకుంటే రాబోయే ప్రదర్శనలు మరింత జనరంజకంగా సాగుతాయని, ప్రేక్షకులు మరింత ప్రచారం కల్పించడం ద్వారా వేదిక ముందు పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు చేరి, నాటక దృశ్యాలను పులకిత గాత్రులై దర్శించి, సురభి వారి ప్రయత్నానికి జేజేలు పలుకుతారని నా నమ్మకం. నటీనటుల నుంచి తనకు కావలసిన స్థాయిలో, పూర్తి నటనా సామర్థ్యాన్ని రాబట్టుకోవడం దర్శకుడు ఎవరైనా చేయవలసిన పని. నటీనటులకు వాళ్ళ సహజమైన మూస ధోరణిలోనే నటిస్తుంటే, తనకు కావలసిన ఎఫెక్ట్ సాధించుకోవడంలో మొహమాట పడకూడదు. ఆహార్యం విషయంలో, ఆయా ఘట్టాల్లోని వ్యక్తులను, దగ్గరి పోలికలతో చూపే ప్రయత్నం బాగుంది. ఈ నాటకం మరిన్ని ప్రదర్శనలకు నోచుకుని, సురభి సమాజం ఇప్పటితరం ముందు లైమ్ లైట్‌లో కనిపించాలని ఆకాంక్ష.

- మల్లేశ్వరరావు ఆకుల
79818 72655

పర్యావరణ హితం ఆకుపచ్చని 'విశ్వగీతం'

సమీక్ష

కేంద్ర సాహిత్య అకాడమి బాల సాహిత్య పురస్కారం గెలుచుకున్న 'బాలల తాతా బాపూజీ' పుస్తకమే కాకుండా నన్ను అమితంగా ఆకర్శించే డా.పత్తిపాక మోహన్ మరో పుస్తకం 'ఆకుపచ్చని పాట'. పత్తిపాక మోహన్‌కు సాహిత్య అకాడమి పురస్కార ప్రదానం, ఆయన బాల సాహిత్య రజతోత్సవం సందర్భంగా 'ఆకుపచ్చని పాట' గురించి ముచ్చటిద్దాం. ఈ పుస్తకంలో 25 గేయాలున్నాయి. ఆ గేయాలకు చక్కని బొమ్మలుఉన్నాయి. చిన్న పిల్లలు కూడా సునాయాసంగా ఆసక్తితో ఈ పుస్తకం చదవగలరు. అతి తేలిక పద నిర్మాణంతో మోహన్ ఈ గేయాలను విరచించారు.





మొదటి గీతం 'జేజేలు'లో అమ్మను అనురాగపు కొమ్మ అనీ, నవమాసాలు మోసి కని, పెంచిన బంగరుతల్లి అనీ... నాన్నేమో మమకారపు పాలవెల్లి అనీ చెప్పి పిల్లల్లో తల్లితండ్రుల మీద ప్రేమను మొలకెత్తించడానికి ప్రయత్నించారు. 'స్వచ్ఛ గణపతి' గేయంలో మట్టి గణపతిని పూజించుటే మేలని, రసాయనిక రంగులు పూయడం తప్పని హితబోధచేసి... మట్టి గణపతిని అనువు చెయ్యడం వల్ల చెరువులు, వాగులు, చెల్కల్ని స్వచ్ఛజలాలతో ఉంచగలమని ప్రకటిస్తారు. 'ప్రగతి బాట' గేయంలో పల్లెలెలా ఉండాలో చెబుతారు.

'చెట్టును నేను' గేయంలో చిన్న పాదాల్లో అతి పెద్ద భావాలను ఎలా ప్రకటించొచ్చో చూడవచ్చు. 'ఇంటిలోన నేనుంటే / ఇల్లంత క్షేమం / తోటలోనే నేనుంటే / ఊరెంతో ఆనందం' అని చెట్టు స్వగతాన్ని పలికించారు. 'బడి-గుడి' గేయం కూడా ఇటువంటిదే. ఈ గేయం చివరిలో- 'శుచి శుభ్రత తెలిసొస్తే/ ఇల్లు స్వర్గమవుతుందోయ్ / బడి గుడిలా అనిపిస్తే / చదువు దైవం అవుతుందోయ్' అని పేర్కొన్నారు.

'స్వచ్ఛ సైనికుడు'లో యుద్ధ సైనికుడు మాతృభూమి రక్షణకోసం నిలబడితే, చెట్టు స్వచ్ఛభారత్ నిర్మాణానికి సైనికుడై నిలుస్తుందని చెప్పడం మంచి భావుకత. పల్లె వర్ధిల్లితే ఏమవుతుందో, పల్లె వర్ధిల్లాలంటే ఎలా ఉండాలో కూడా ఈ పుస్తకంలో చెబుతాడు కవి. పల్లెలాగ పట్నముంటె దేశ ప్రగతికి అడ్డే ఉండదని, అందరూ కలిసి పనిచేయాలని, పరిసరాలు కాపాడుకుంటే బతుక్కు భయముండదని చెప్పే గేయం 'పల్లె పచ్చగుంటే'.

ఈ సంపుటిలోని గేయాలన్నీ ఆకుపచ్చని గేయాలే. భూమాత గాయాలను తుడిచి హరితంగా వెలగాలన్న తపనతో రాసినవే. 'ఆరుబయట' గేయంలో 'మనమంతా మానవులం/ జంతువులం కాదు కదా!' అని మనలోని లోపాన్ని ఎత్తి చూపిన కవి-

'ఒకటి రెండు పనులెపుడు/ చాటున జరగాలి కదా/ తలుపుచాటు ఉంటేనే / పరువు మనకు మిగులు కదా' అని హితబోధ చేస్తాడు. 'స్వచ్ఛదండు'లో పిల్లల మీద తనకుండే నమ్మకాన్ని వెలిబుచ్చుతాడు ఈ బాలల మిత్రుడు. 'బడినుండే ఏదైనా/ మొదల్కెతే శుభం శుభం/ విద్యార్థులు పూనుకుంటే/ ప్రతిపనిలో జయం జయం' అన్ని 'స్వచ్ఛభారత్' కు శుభారంభం బడి నుండే కావాలని ఆకాంక్షిస్తారు. పరిశుభ్రతను గురించి పిల్లలకు బోధిస్తూ- 'బడిపిల్లలు పూనుకొని / స్వచ్ఛదండుయై కదలాలి / జనగణ మన గీతంలా / ఆకుపచ్చపాట పాడాలి' అని పిల్లలకు మంచి సందేశాన్నిచ్చారు.

సరళమైన పదాలతో, చిట్టిచిట్టి పాదాలతో పిల్లల నాలుకల మీద నర్తించే గీతాలు రాయడం పత్తిపాక మోహన్‌కు తెలిసిన విద్య. అటువంటి దివ్యధనమే 'దివ్యధనం' గీతం- 'భూమి మనది/ గాలి మనది/ జీవించే హక్కు మనది/ తరతరాల ఈ సంపద/ తరగకుండ చూడాలి' అని చెబుతూ స్వచ్ఛతను ఒక దివ్యధనంగా పేర్కొని పిల్లలను ఉత్తేజపరిచారు. కాలుష్యం వల్ల మనకు కలిగే ప్రమాదాలను, పచ్చదనం, పరిశుభ్రతల ప్రమోదాలను, ప్రయోజనాలను ఈ పుస్తకంలో అనేక గేయాల్లో వివరించిన మోహన్ ప్రత్యేకించి 'కాలుష్యం'పై రాసిన గేయంలోనూ దానిని బలంగా చెప్పారు.

'శుభ్రఎరిన లోగిళ్ళు/ భగవంతుని ఆలయాలు/ స్వచ్ఛమైన పరిసరాలు/ నాగరికత ఆనవాళ్ళు' అంటారు. అంతటితో ఆగక-

'స్వచ్ఛతయే దేవుడని / గాంధితాత అన్నాడు'/ స్వచ్ఛంగా బతికి తాను / గౌరవాన్ని పొందాడు' అని గాంధీని, ఆయన ఆచరణను పిల్లలకు అర్థమయ్యేలా చెబుతారు. గాంధీతత్వాన్ని బాలలకు అందించినందుకే కదా, మోహన్‌కు సాహిత్య అకాడమి పురస్కారం లభించింది. మానవుడు సంఘజీవి, బుద్ధిజీవి. అటువంటి వాడు హద్దుమీరి చేసే పొరపాట్లతో భూగోళానికి ఎన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయో, జీవజంతుజాలానికి ఎంత నష్టం కలుగుతుందో మనకు తెలుసు. మానవుడు చేస్తున్న పొరపాట్లను బాలలకు బాల్యంలోనే తెలియజేస్తూ, భవిష్యత్తులో రేపటి పౌరులు వాటిని చేయకూడదన్న తపనతో రాసిన గేయం 'బుద్ధిజీవి'. సఫాయీ కార్మికులు చేసిన, చేస్తున్న సేవలు అమూల్యం, ప్రశంసనీయం. మనం ప్రపంచవ్యాప్తంగా కరోనా కరాళ నృత్యం చేస్తున్నప్పుడు తమ ప్రాణాలకు తెగించి వైద్యులు, పోలీసు ఇతరులతో పాటు వాళ్ళు చేసిన సేవలు, త్యాగాలు మనం చూశాం. వాళ్ళను 'ఆరోగ్య దూతలు' అని అంటారు మోహన్. 'అగ్నిగోళం' పిల్లలనే కాదు పెద్దలనూ ఆలోచింపజేసే గేయం. పర్యావరణ సమస్యపై పూర్తి అవగాహన కలిగించే బాల గీతం ఇది. ఇందులో 'విశ్వం' అనే గేయం కూడా ఉంది. ఇది పర్యావరణ విపత్తుల గురించి పిల్లలకు అవగాహనను పెంచి ఆలోచనలను కలిగిస్తుంది. తెలంగాణ పెద్ద పండుగ బతుకమ్మ, ఆ పండుగ వెనుకవున్న పర్యావరణ నేపథ్యాన్ని 'ఎరువు' గేయంలో చెప్పారు. గాంధీ పట్ల, ఆయన మార్గం పట్ల, ఆచరణ పట్ల, తత్వంపట్ల కవికి అపారమైన గౌరవం, నమ్మకం. అది ఆయన గేయాలన్నింటిలో కనిపిస్తుంది. 'గాంధీమార్గం' గేయంలో కవి 'పల్లెటూర్లు దేశానికి పట్టుగొమ్మలు' అని చెప్పి- 'పరిసరాలు శుభ్రమైతె / పల్లె సీమయే స్వర్గం / పాడిపంట వర్ధిల్లితె / అన్నపూర్ణ ఆ దేశం / శుభ్రతను పాటిస్తే / అదే రామ రాజ్యం' అని చెబుతారు.

'జీవనగీత'లో 'మనసు శుభ్రమైతె / మాత్సర్యం ఉండదు / మనం శుభ్రమైతె/ అనారోగ్య మంటదు', 'ఇల్లు శుభ్రమైతె / వెల్లువెత్తును ఆరోగ్యం / ఊరు శుభ్రమైతె / అభివృద్ధికి ఆదర్శం' అంటారు. పచ్చని చెట్లకు 'ఆహ్వానం' పలికిన కవి అందుకు వానలు కురవాలని కోరతారు. వర్షాకాలం వర్ణనతో గేయాన్ని నింపి, ప్రకృతి వ్యవసాయం గురించి కూడా పరిచయం చేసి భూసారం నిలపండని బాలలను, పెద్దలను కోరుతారు. ఈ 'ఆకుపచ్చని పాట'లో ప్రకృతి, పర్యావరణం, పచ్చదనం, పరిశుభ్రతతో పాటు వైజ్ఞానిక అంశాలకు సంబంధించిన గేయాలు కూడా ఉన్నాయి. ఇందులోని 'పరిసరాలు' గేయం పరిసర విజ్ఞాన సుభాషితాలు చెప్పే గేయం.

డాక్టర్ పత్తిపాక మోహన్ తన నైపుణ్యమంతా రంగరించి ఈ 'ఆకుపచ్చని' గీత రచించారు. మానవాళికంతకు నేడు అవసరమైన పరిశుభ్రత అంశాన్ని సరళ భాషలో గేయాలుగా మలిచి మన పిల్లల కందించడం చాలా అభినందించదగిన విషయం. 2022 సంవత్సరపు ప్రతిష్టాత్మక కేంద్ర సాహిత్య అకాడమి బాల సాహిత్య పురస్కారం' ఇవ్వాళ్ళ అందుకుంటున్న బాల సాహితీవేత్త డా. పత్తిపాక మోహన్‌కు శుభాకాంక్షలు. భవిష్యత్తులో మరిని 'బాలగీత'లు ఆయన కలం నుంచి రావాలని ఆకాంక్షిద్దాం.

(నేడు డాక్టర్ పత్తిపాక మోహన్‌కు ఢిల్లీలో కేంద్ర సాహిత్య అకాడమి బాల సాహిత్య పురస్కార ప్రదానం జరుగుతుంది.)

- బెలగాం భీమేశ్వరరావు
99895 37835

జీవితంపై ప్రసరించే కవితాకాంతి


మానవత్వానికి, మనిషి తత్త్వానికి ఒక అనుసంధాన సూత్రం కవిత్వం. అసలు కవిత్వాన్ని కచ్చితంగా ఆవిష్కరించేవారెవరు? ఆంగ్ల కవి జేమ్స్ జాయిస్, కవిత్వం గురించి ఓ మాట చెప్పాడు. అది : Poetry, even when apparently most fantastic, is always a revolt against artifice, a revolt, in a sense, against actuality, Poetry is the one place where people can speak their original human mind. It is the outlet for people to say in public what is known in private .

కవిత్వానికి ఏ వస్తువును వేళ్లాడదీసినా అది సందేశాత్మకంగా ఉండాలి.కవిత్వం ఎంత అద్భుతమైనదైనా వాస్తవానికి వ్యతిరేకంగా ఉండకూడదు. కవిత్వంలో వ్యక్తి ఆవిష్కరణ అవసరం లేదు. మరి అలాంటి కవిత్వం ఎలా ఉంటుంది? తెలుసుకోవాలంటే స్వచ్ఛమైన కవి వాకిట నిలబడాలి. ప్రఖ్యాత కవి డాక్టర్ పెరుగు రామకృష్ణ తాజా కవిత్వ సంపుటి 'వర్ణలిపి' చదివితే- పై మాటలకు మనకు అర్థం తెలుసొస్తుంది.

'వర్ణలిపి' పేరులోనే కవిత్వం ఉంది. నాలుగు దశాబ్దాలుగా కవిత్వమే శ్వాసగా, ధ్యాసగా భావించిన ప్రముఖ కవీ, బహుభాషా ప్రవీణులు రామకృష్ణ. తెలుగు కవిత్వపు ఎల్లలను అంతర్జాతీయ స్థాయికి చేర్చి, పేరెన్నిక గన్న కవి. ఈ సంపుటిలో ఈ కవి భావాలను తరచి చూస్తే ..

'అంటార్కిటాలో విరిసిన కుసుమమైనా/ దక్షిణాఫ్రికా ఎడారుల్లో కళ్ళు తెరచిన కాక్టస్ మొక్కైనా/ ప్రాణం ఖరీదు ఒక జీవితమే/ జీవితమంటే జనన మరణాల జోతిష్కుక్రం కాదు/ వాసంత సమీర వేణుగానం' అంటూ జీవితాన్ని గురించిన తాత్పర్యం వెల్లడిస్తారు. ఆయన తాత్విక పదావిష్కరణ గొప్ప ఆనందానుభూతిని కలిగించింది. 'దేశానికి రెపరెపలాడే జెండా / వీర జవాను../ ఆ జెండాకి గడకర్ర లాంటి/ వెన్నెముక రైతు' / రైతుకీ భూమికీ ఉన్న ఆత్మబంధం/ తూరుపు తీరపు వెలుతురు లాంటిది/ దేశం పడమటి తల దీపమయింది' అంటారు ఒక కవితలో. ఎంత గొప్ప భావన? కవిత్వంలో వివిధ పదచిత్రాల పరస్పర సంబంధం వల్ల కావ్యానికి అర్థవత్వం లభిస్తుంది. దిగులును వర్ణించినా ఆ దిగులుకు దివ్వెల్ని వెలిగించి ఆ వెలుగులో తన భావాల్ని పండించే కవి ఈయన. కవిత్వాన్ని, జీవితాన్ని అనుసంధానం చేస్తూ ఎంతో అనుకూలంగా. అంతరాంతరాల్లో ఉన్న వేదనను సైతం వర్ణనాత్మకంగా మార్చగలిగే శక్తి ఈ కవి కలానికి ఉంది. 'శృతిలయలను సెలవంటూ/ హృదయం ఎక్కడుందో వెదుక్కుంటూ/ ఏమంత తొందర ముంచుకొచ్చిందని/ వెళ్ళిపోయావు మిత్రమా!' అని ఆవేదన చెందుతూనే 'ప్రపంచం కోల్పోయిన హృదయం అంటారు. నా మదిలో నీ స్మృతి విత్తనం నేడు నాటుకుంటున్నా' అంటారు. రచయిత సింగమనేని మరణం గురించి వ్యాకులపడుతూ ఇలా అంటారు : 'వర్ధమాన రచయితల్ని సాహిత్య పొలంలో/ తోడిబోసే బొక్కెన లాంటి పెద్ద మనిషి అతడు/ అక్షరాన్ని నఖశిఖ పర్యంతం కప్పుకుని / పఠితకు సెలవంటూ పయనమయిన/ మా సింగమనేనికి జోహార్లు' అర్పించారు.

కార్పొరేట్ జీవితాలను ఉద్దేశించి రచించిన 'కార్పొరేట్ కార్ముకం', ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా రాసిన 'సజీవ స్పర్శ', నూతన సంవత్సరాన్ని ఉద్దేశించిన



'వెలుతురు పండగ', ఉగాదిని తలపించే 'ఓ కలల వేకువ' వంటి కవితలు చక్కని భావ వ్యక్తీకరణకు నిదర్శనాలు. 'ప్రియమైన చేతులు' కవిత్వంలో 'బంజరును తాకి బంగరు మాగాణిగా/ మలిచే పరుసవేది చేతులు/ విత్తును నాటి ప్రాణ ప్రతిష్ట చేసే చేతులు/ పచ్చని సంజీవని చేతులు/ ఆ చేతులంటే నాకెంతో ఇష్టం..' అంటూనే 'పొలం పార పట్టి పలుగు తీసే చేతులు/ సరిహద్దుల్లో తుపాకీ పట్టిన చేతులు/ మట్టి పొరల్లా వృద్ధాప్యంలో ముడతలు పడ్డ చేతులు/ ఆకలిగొన్నవారికి అన్నంపెట్టే చేతులు/ జెండా మోసే చేతులు అంటే నాకెంతో ఇష్టం' అని వివరించారు. దేశ పౌరునిగా ప్రతి ఒక్కరికీ బాధ్యతను గుర్తు చేసేలా ఈ కవిత సాగింది.

ఈ సంపుటి మరో మెరుపు హైకూలు. ఉదాహరణగా గమనించండి. 'చెట్టును కూడా/ అర్థవంతం చేస్తుంది/ పిచ్చుక పాట'. 'సముద్రానికి / నిద్రను దూరం చేసింది/ తుఫాను రాత్రి', 'పాట కొరకు/ వెదురును వేడుకుంది/ అడవి గాలి' వంటి ఆణిముత్యాలు ఈ సంపుటిలో ఉన్నాయి.

ఈ కవి కవిత్వంలో గొప్ప విశేషం క్లుప్తత. బహుకొద్ది వాక్యాల్లోనే చక్కని ఆత్మను కుదర్చటం మనకు కనిపిస్తుంది. 'గోడమీద పిచ్చుక బొమ్మొకటి/ నోరు తెరచి నన్ను ప్రశ్నిస్తున్నట్టు/ మానవ జాతి అభివృద్ధికోసం/ జీవ వైవిధ్యాన్ని నాశనం చేస్తున్న విధ్వంసకారుడిలా/ ఆ బొమ్మ ముందు మోకరిల్లిన నేరస్తుడిని నేను' అంటారు తమ 'ఇనప చెట్లు' కవితలో. 'తీర్థయాత్ర' కవితలో- 'మిత్రమా/ వశిష్టుడు కమండలంలో / సముద్రాన్ని వొంపుకెళ్ళాడు/ మొత్తం పదకొండు కోట్ల కెరటాలు/ పదకొండు వందల లక్షల క్యూసెక్కులు/ చాచిన చేతులు చాచినట్లే/ అర్థిస్తున్నట్లే ఉన్నాయి' అనడంలో గొప్ప గూడార్థాన్ని స్ఫురింపచేశారు. ఇంకా కంచిమేక, దేహాలయం, మాల్, నిశ్శేష శేషం, అంతిమ సేవ, యుద్ధ చరిత్ర కవితల్లో లోతైన భావాలు పఠితలను వెంటాడతాయి.

కొన్ని అనువాద కవితలు కూడా ఈ సంపుటిలో ఉన్నాయి. కొన్ని కంటతడిని తెప్పించాయి. పాకిస్తాన్ కవి మహమ్మద్ షానజర్ కవితలో... 'అమ్మా! ఎంత బాధగా ఉంది/ మనం చిలకల పంజరం విప్పలేదు/ ఇప్పటికీ అక్కడే ఉన్నాయి/ వాటికి ధాన్యం, నీరు ఎవరు ఇస్తారు?/ అమ్మా! మా నాన్న ఎక్కడ?/ మన వెనకాలే వస్తున్నాడన్నావ్/ వారంతా పడకలపై ఎందుకు పడుకోరు?/ విశ్రాంతి ఎందుకు తీసుకోరు?' అన్న ప్రశ్నలు మనల్ని కంటతడి పెట్టిస్తాయి. ఈ 'వర్ణలిపి' అనేక వర్ణాలకు భాష్యం చెప్పింది. అనేక సమస్యలకు సామరస్యత చూపింది. ఆలోచనల్ని రేకెత్తించింది. ఆవేశాలకు అర్థం చెప్పింది. కవికి హృదయపూర్వక అభినందనలు.

- శైలజామిత్ర

అవినీతి వ్యతిరేక గేయాలు, వచన కవితల పోటీ

అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవినీతి వ్యతిరేక గేయాలు, వచన కవితల పోటీ... ఆంధ్ర ప్రదేశ్ ఆమ్ ఆద్మీ పార్టీ నిర్వహిస్తోంది. ప్రథమ బహుమతి అయిదు వేలు, ద్వితీయ బహుమతి మూడు వేలు, తృతీయ బహుమతి రెండు వేల రూపాయలు. అవినీతి వ్యతిరేకతతో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ లక్ష్యాలు కూడా ఉండేలా రచన లుండాలి. 24 పాదాలకు మించని రచనల్ని 9493686165 వాట్సప్ నంబరుకు మీ పేరు, వూరు, చిరునామాతో సహా టైప్ చేసి నవంబర్ 30 లోగా పంపించాలని కోరుతున్నాము. కవితల్ని SHO AP.tv chanel ద్వారా అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం డిసెంబర్ 9న ప్రసారం చేయడం జరుగుతుంది.

- డా. రావి రంగారావు

బహుజన స్ఫూర్తి ప్రదాతలుపై జాతీయ సదస్సు

గజ్వేల్ పట్టణం మేన్ ఎడ్యుకేషనల్ హబ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రజతోత్సవాల సందర్భంగా తెలుగు అధ్యయనశాఖ, రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (RUSA), తెలంగాణ భాషా & సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 'బహుజన స్ఫూర్తి ప్రదాతలు' (Bahujan Inspirational Personalities) అనే అంశంపై 17, 18 నవంబర్ 2022న రెండు రోజుల పాటు జాతీయ సదస్సును నిర్వహిస్తోంది. ప్రారంభ సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ. శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారు. తెలంగాణ కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్, ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య డి. రవీందర్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. గౌరవ అతిథిగా తెలంగాణ సాహిత్య అకాడమి అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్, ఆత్మీయ అతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య చింతకింది కాశీం హాజరవుతారు. తెలంగాణ చరిత్ర, సాహిత్య విమర్శకులు సంగిశెట్టి శ్రీనివాస్ కీలకోపన్యాసం చేస్తారు. పలువురు ప్రముఖులు ఆయా అంశాలపై పత్ర సమర్పణ చేస్తారు.

- డా.వెల్దండి శ్రీధర్, సదస్సు సంచాలకులు, 9866977741

సూర్య సాహితీవేదిక బాలల కథలపోటీ

సాహితీకిరణం - సూర్య సాహితీవేదిక సంయుక్త ఆధ్వర్యంలో బాలల కథల పోటీ నిర్వహిస్తున్నాం. ప్రథమ బహుమతి: రూ.3000, ద్వితీయ బహుమతి రూ.2500, తృతీయ బహుమతి రూ.1500; ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున 5 ప్రత్యేక బహుమతులు ఉంటాయి.కథ నిడివి చేతిరాతలో 2 పేజీలకు, డిటిపిలో ఒక పేజీకి మించరాదు. రచనపై రచయిత పేరు, చిరునామా, సెల్ నెంబర్ ఉండరాదు. హామీపత్రంపై విడిగా రాయాలి. బాలల్లో నైతిక విలువలు, కుటుంబ అనుబంధాలు, సృజనాత్మకత, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, సాహసం తదితర అంశాలు ప్రతిబింబించే కథలు మాత్రమే రాయాలి. కథలు పోస్టు/ కొరియర్ ద్వారా మాత్రమే 30.11.2022లోగా పంపాలి. చిరునామా : సాహితీకిరణం ఇం.నెం. 11-13-154, అలకాపురి, రోడ్ నెం. 3, హైదరాబాద్-500102. ఫోన్: 040-29550181.

- పొత్తూరి సుబ్బారావు

రామ్‌దేవ్ దివ్యా ఫార్మసీపై నిషేధం ఎత్తివేత

డెహ్రాడూన్ : ఐదు మెడిసిన్‌ల ఉత్పత్తిని నిలిపివేయాలంటూ యోగా గురువు రామ్‌దేవ్ బాబాకు చెందిన దివ్యా ఫార్మసీపై ఉన్న నిషేధం తొలగిపోయింది. ఈ మేరకు ఉత్తరాఖండ్ ఆయుర్వేద, యునానీ లైసెన్సింగ్ అథారిటీ ఆదేశాలు జారీ చేసింది. డయాబెటిస్, రక్తపోటు, గాయిటర్, గ్లాకోమా, అధిక కొలెస్ట్రాల్ వంటి ఐదు వ్యాధులకు సంబంధించిన మందులను ఉత్పత్తి చేయొద్దంటూ దివ్యా ఫార్మసీపై నిషేధం ఉండేది. ఇప్పుడు సంబంధిత విభాగం నుంచి నిషేధాన్ని ఎత్తివేస్తూ ఉత్తర్వులు రావటంతో వాటి ఉత్పతికి మార్గం సుగమమైంది. గత ఆర్డర్‌లో తప్పు ఉన్నట్టు రాష్ట్ర హెల్త్ అథారిటీ జీసీఎన్ జంగ్‌పంగి తెలిపారు. ఉత్తర్వు ఇచ్చే ముందు వివరణ కోరుతూ కంపెనీకి కొంత సమయం ఇచ్చి ఉండాల్సిందన్నారు. కాగా, తప్పును సరిదిద్దినందుకు రామ్‌దేవ్ బాబా మిత్రుడు ఆచార్య బాలకృష్ణ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

'తుపాకీ' నిబంధనలు కఠినతరం : పంజాబ్ సిఎం

చండీగఢ్ : రాష్ట్రంలో తుపాకీ సంస్కృతిని అరికట్టేందుకు ఆయుధ చట్టాలను మరింత కఠినతరం చేయనున్నట్లు పంజాబ్ ఆప్ ప్రభుత్వం ప్రకటించింది. ఆన్‌లైన్‌లో, బహిరంగంగా ఆయుధాల ప్రదర్శనపై నిషేధం విధిస్తున్నట్లు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ ప్రకటించారు. అలాగే హింసను లేదా ఆయుధాలను ప్రశంసిస్తూ సాగే పాటలు కూడా నిషేధిస్తామన్నారు. ఇప్పటి వరకు జారీ చేసిన ఆయుధాల లైసెన్స్‌లను రాబోయే మూడు నెలల్లో క్షుణ్ణంగా పునఃపరిశీలించనున్నట్లు తెలిపారు. ఆయుధాలను నిర్లక్ష్యంగా వినియోగించడం, వేడుకల్లో ఉపయోగించడం శిక్షార్హమైన నేరమని, ఉల్లంఘించినవారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ముంబయి విమానాశ్రయంలో 61 కిలోల బంగారం సీజ్

ముంబయి : దేశ వాణిజ్య రాజధాని నగరమైన ముంబయిలో కస్టమ్స్ అధికారులు ఆదివారం ఒక్కరోజే రూ.32 కోట్ల విలువైన 61 కిలోల బంగారాన్ని జప్తు చేశారు. ఒక్కరోజులో ఇంతపెద్ద మొత్తంలో బంగారం పట్టుబడటం ఇదే తొలిసారి అని కస్టమ్స్ అధికారులు తెలిపారు. విదేశాల నుండి ముంబాయి విమానశ్రయానికి చేరుకున్న ఏడుగురు ప్రయాణికులు వద్ద బంగారు బిస్కెట్లు ఉన్నట్లు గుర్తించామని అన్నారు. వారిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. పథకం ప్రకారం 61 కేజీల బరువు ఉన్న బిస్కట్లను 7 భాగాలుగా చేసి నడుము బెల్టులో దాచి తరలించేందుకు యత్నించినట్లు తెలిపారు. దీని కోసం స్పెషల్‌గా నడుము బెల్టులను తయారు చేయించినట్లు వివరించారు. ఆఫ్రికా దేశం టాంజానియా నుంచి దోహా మీదుగా స్మగ్లర్లు ముంబయికి చేరుకున్నారని అన్నారు. దోహ ఎయిర్ పోర్టులో బంగారు బిస్కట్లతో ఉన్న నడుము బెల్టును సూడాన్ జాతీయుడు స్మగ్లర్లకు అప్పగించినట్లు సమాచారం.

ఇస్తాంబుల్‌లో పేలుడు

- ఆరుగురు మృతి

ఇస్తాంబుల్ : టర్కీ రాజధాని నగరం ఇస్తాంబుల్‌లో ఆదివారం జరిగిన ఆత్మాహుతి పేలుడులో కనీసం ఆరుగురు చనిపోయారు. మరో 50 మంది పైగా గాయపడ్డారు. ఈ విషయాన్ని టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయీప్ ఎర్డోగాన్ వెల్లడించారు. పేలుడు ఘటన చాలా నీచమైన దాడి అని ఆయన పేర్కొన్నారు. ఇస్తాంబుల్‌లో రద్దీగా ఉండే మార్కెట్ ప్రాంతమైన తక్సిమ స్క్వేర్‌లోని ఇస్తిక్లాల్ ఎవెన్యూలో స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 4.20 నిమిషాలకు ఈ పేలుడు సంభవించింది. ఘటన స్థలానికి పోలీసులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. క్షతగాత్రులను అంబులెన్సుల ద్వారా సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. హెలికాప్టర్ల చక్కర్లు కొడుతూ భద్రతను పర్యవేక్షిస్తున్నట్లు కనిపించాయని వార్తా సంస్థలు తమ కథనాల్లో పేర్కొన్నాయి. 2016లో కూడా ఇదే మార్కెట్ ప్రాంతంలో ఆత్మాహుతి చోటుచేసుకుంది.

ప్రభుత్వ ఏర్పాటుకు నెతన్యాహుకు ఆహ్వానం

జెరూసలెం : ఇజ్రాయిల్‌లో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా నెతన్యాహును ఇజ్రాయిల్ అధ్యక్షులు ఐజాక్ హెర్జోగ్ ఆదివారం అధికారికంగా ఆహ్వానించారు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి 28 రోజుల గడువు ఉంది. అవసరమైతే దీనిని మరో 14 రోజులు పొడిగిస్తారు. ఈ నెల 1న జరిగిన ఇజ్రాయిల్ పార్లమెంట్ ఎన్నికల్లో నెతన్యాహు కూటమికి 64 స్థానాలు లభించాయి. ఈ విజయంతో నెతన్యాహుకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం లభించింది. దీంతో రికార్డు స్థాయిలో ఐదోసారి ఇజ్రాయిల్ ప్రధానమంత్రిగా నెతన్యాహు బాధ్యతలు స్వీకరించనున్నారు. నెతన్యాహు కూటమి విజయంతో 2019 నుంచి ఇజ్రాయిల్‌లో కొనసాగుతున్న రాజకీయ సంక్షోభం ముగుస్తుందని భావిస్తున్నారు. ఇజ్రాయిల్‌లో గత నాలుగేళ్లలో ఐదుసార్లు ఎన్నికలు జరిగాయి.

వచ్చే వారాంతంలో 'బ్లూటిక్'

వాషింగ్టన్ : ట్విటర్ బ్లూ టిక్స్ సబ్‌స్క్రిప్షన్ వచ్చే వారం చివరలో తిరిగి ప్రారంభం కావచ్చుని ట్విటర్ యజమాని ఎలన్ మస్క్ తెలిపారు. పుట్టగొడుగుల్లా నకిలీ ఖాతాలు పెరిగిపోతుండటంతో బ్లూటిక్ సబ్‌స్క్రిప్షన్ కోసం మస్క్ ఇటీవల 8 డాలర్లు వసూలు చేయనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే.

నిర్దోషులే ఎక్కువ..శిక్ష కొందరికే

- పోక్సో కేసుల తీరు
- చాలా కేసుల్లో విచారణకు కనీసం రెండేళ్లు
- యూపీలో కేసులు అధికం
- చట్టం అమల్లోకి వచ్చి నేటికి పదేళ్లు
- విచారణల తీరుపై సామాజిక కార్యకర్తల ఆందోళన



న్యూఢిల్లీ : లైంగికదాడి నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కలిగించే చట్టం పోక్సో యాక్ట్. ఈ చట్టం దేశంలో అమలులోకి వచ్చి నేటికి (నవంబర్ 14) సరిగ్గా పదేళ్లు. అయితే, పోక్సో కేసుల్లో విచారణ తీరు ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్నది. ఇలాంటి కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు ఎట్టకేలకు నిర్దోషులుగా బయటపడుతున్నారు. ప్రతి ముగ్గురు నిర్దోషులుగా తేలితే ఒకరు మాత్రమే దోషిగా శిక్షను అనుభవిస్తున్నారు. దేశవ్యాప్తంగా పోక్సో చట్టం కింద నమోదవుతున్న కేసుల సంఖ్య అధికంగానే ఉన్నది. కానీ ఆ కేసుల విచారణకు అధిక సమయమూ పడుతున్నది. ఇది న్యాయవ్యవస్థలో పోక్సో కేసుల విషయంలో న్యాయవ్యవస్థ తీరును ఎత్తి చూపుతున్నదని సామాజిక కార్యకర్తలు తెలిపారు. కాగా, ఈ సమాచారాన్ని ఢిల్లీ కేంద్రంగా పని చేసే విధి సెంటర్ ఫర్ లీగల్ పాలసీ వివరించింది.

చాలా వరకు కేసులు కనీసం రెండేళ్ళ వరకు సమయాన్ని తీసుకుంటున్నాయి. పోక్సో కింద నమోదైన మొత్తం కేసుల్లో 47.7 శాతం కేసుల విచారణకు ఏడాది కంటే తక్కువ సమయం పట్టింది. 1 నుంచి 2 ఏండ్ల మధ్య సమయం తీసుకున్న కేసుల సంఖ్య 26.9 శాతంగా ఉన్నది. 13.5 శాతం కేసుల పరిష్కారానికి రెండు నుంచి మూడేళ్లు సమయం తీసుకున్నది. ఇక 11.9 పోక్సో కేసుల విచారణకు మూడేండ్లకు పైగా సమయం పట్టటం గమనార్హం. ఈ కేసులలో ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు నిర్దోషులుగా బయటపడుతుండటం ఆందోళనకరంగా ఉన్నది.

ఈ అధ్యయనం చేసిన సంస్థ మొత్తం 1.12 లక్షల కేసులను పరిశీలించింది. ఇందులో నిర్దోషులుగా తేలిన కేసులు 43.4 శాతంగా (48,544 కేసులు) ఉన్నాయి. 14 శాతం కేసులు (15,675 కేసులు) దోషులుగా, బదిలీ అయిన కేసులు 22.8 శాతంగా (25,434 కేసులు) ఉన్నాయి. సిక్కింలోని నామ్చి జిల్లా.. ఈ-కోర్టుల్లో పోక్సో కింద ఒక లక్ష మంది జనాభాకు అధిక కేసులు నమోదైన జిల్లాగా ఉన్నది. ఇక్కడ మొత్తం 223 కేసులు నమోదయ్యాయి. రెండో స్థానంలో ఢిల్లీలోని న్యూఢిల్లీ జిల్లా నిలిచింది. తెలంగాణలోని మెదక్ నాలుగో స్థానంలో ఉన్నది. తెలంగాణ నుంచి ఆదిలాబాద్ కూడా ఈ జాబితాలో ఉన్నది. 2020లో కరోనా మహమ్మారి ప్రభావం పోక్సో కేసులపై పడింది. దీంతో చాలా వరకు కేసులు అలాగే నిలిచిపోయాయి. 2013లో 2,932 కేసులు పెండింగ్‌లో ఉండగా, 322 కేసులు మాత్రమే విచారణను ముగించాయి. 2019లో పెండింగ్ కేసుల సంఖ్య 93,993గా, విచారణ పూర్తైన కేసులు 28,471గా ఉన్నాయి. ఇక 2020లో మాత్రం ఆ సంఖ్య మరింతగా పెరిగింది. 1,18,856 కేసులు పెండింగ్‌లో ఉండగా, 19,658 కేసుల విచారణ పూర్తవటం గమనార్హం.

2013-2020 మధ్య పెండింగ్ కేసులు, విచారణ పూర్తయిన కేసులు రాష్ట్రవ్యాప్తంగా చూసుకుంటే.. యూపీలో అత్యధికంగా మొత్తం 39వేలకు పైగా పోక్సో కేసులు ఈ-కోర్టుల్లో నమోదయ్యాయి. ఇందులో 30,823 పెండింగ్ కేసులు, 8,812 కేసులు విచారణ పూర్తయిన కేసులుగా ఉన్నాయి. రెండో స్థానంలో ఉన్న మహారాష్ట్రలో 19,432 పెండింగ్ కేసులు, విచారణ పూర్తయిన కేసులు 12,832గా ఉన్నాయి. మూడో స్థానంలో గుజరాత్ ఉన్నది. ఇక్కడ పెండింగ్ కేసులు 8,650గా, విచారణ పూర్తయిన కేసులు 8,117గా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెండింగ్ కేసులు 1554గా ఉండగా, విచారణ పూర్తయినవి 3,074గా ఉన్నాయి. అయితే, పోక్సో చట్టం కింద నమోదైన కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరగాలని సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేశారు. ప్రస్తుత తీరును వారు తప్పుబట్టారు. పెండింగ్ కేసుల సంఖ్య మరింత తగ్గాలన్నారు. ఇందుకు న్యాయస్థానాలు, ప్రభుత్వాలు కృషి చేయాలని చెప్పారు.

ఉపాధ్యాయుల కొరత

- ఏకలవ్య మోడల్ స్కూళ్లలో పరిస్థితి
- మాటలతో సరిపెడుతున్న కేంద్రం
- నష్టపోతున్న విద్యార్థులు
- సమస్యను పరిష్కరిస్తామన్న కేంద్ర గిరిజన శాఖ మంత్రి

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఉపాధ్యాయుల కొరతను ఎదుర్కొంటున్నాయి. దీంతో ఆ పాఠశాలల్లో పాఠాలు బోధించటానికి ఉపాధ్యాయులు లేకపోవటంతో విద్యార్థులు తమ విలువైన విద్యా సంవత్సరాన్ని కోల్పోతున్నారు. ఇతర పాఠశాలల విద్యార్థులతో పోల్చుకుంటే చదువులో వెనకబడిపోతున్నారు. అయితే, కేంద్రం ఈ మాత్రం ఈ విషయంలో మాటలతో నెట్టుకొస్తున్నది. మార్పులను తీసుకొస్తామనీ, సమస్యను పరిష్కరిస్తామని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి అర్జున్ ముండా తెలిపారు.గిరిజన విద్యార్థుల కోసం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఈఎంఆర్ఎస్) ఎదుర్కొంటున్న భారీ ఉపాధ్యాయుల కొరతను పరిష్కరిస్తుందని భావిస్తున్న నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (ఎన్ఈఎస్‌టీఎస్) పరిపాలనాపరమైన సవరణ " అతి త్వరలో" ఆమోదించబడుతుందని అర్జున్ ముండా చెప్పారు. సెప్టెంబరులో ఒక వార్తా సంస్థ నివేదించిన సమాచారం ప్రకారం.. 378 ఈఎంఆర్ఎస్‌లలో, ఎన్ఈఎస్‌టీ ఎస్ సిఫారసు చేసిన 11,340 మంది ఉపాధ్యాయులకు కేవలం 4000 మంది ఉపాధ్యాయులుగా పని చేస్తుండటం గమనార్హం. వీరిలో కాంట్రాక్టు, తాత్కాలిక, శాశ్వత ఉపాధ్యాయులు ఉన్నారు.

ఈఎంఆర్ఎస్ లలో ఉపాధ్యాయ నియామకాలను పూర్తిగా కేంద్రం నియంత్రణకు తరలించేందుకు పరిపాలనాపరమైన మార్పును త్వరలో పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి చెప్పారు. ఈ ఏడాది నవంబర్ నాటికి ఉన్న సమాచారం ప్రకారం 688 ఈఎంఆర్ఎస్‌లు మంజూరు కాగా, అందులో 392 మాత్రమే పని చేస్తున్నాయి. కాగా, ఈఎంఆర్ఎస్‌లను నిర్వహించే సంస్థ ఎన్ఈఎస్‌టీఎస్ అధికారులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను సవరించే ప్రక్రియకు వ్యయ విభాగం ఆమోదించిన తర్వాత కూడా దాని ప్రభావాలు కనిపించటానికి కనీసం కొన్నేండ్లు పడుతుందని చెప్పటం గమనార్హం. ప్రస్తుతం ఎన్ఈఎస్‌టీఎస్ వివిధ రాష్ట్రాల్లోని పాఠశాలల నిర్వహణను పర్యవేక్షిస్తున్నది. ఇక్కడ గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేక రాష్ట్ర విద్యా సంఘాలు (ఎస్ఈఎస్‌టీఎస్) ఏర్పాటు చేయబడ్డాయి. ఉపాధ్యాయుల కొరత సమస్యను సత్వరమే పరిష్కరించి విద్యార్థులకు న్యాయం చేయాలని గిరిజన సంఘాలు కేంద్రాన్ని డిమాండ్ చేశాయి.

టిక్కెట్ కోసం టవర్ ఎక్కిన ఆప్ నేత



న్యూఢిల్లీ : ఢిల్లీ మునిసిపల్ కార్పోరేషన్ (డిఎంసి) ఎన్నికల కోసం టిక్కెట్ ఇవ్వకపోవడంతో ఆప్ నేత వినూత్నంగా నిరసన తెలిపారు. మొత్తం 250 సభ్యులు ఉన్న ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కోసం ఆప్ 117 మందితో శనివారం తుది జాబితాను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ జాబితాలో తన పేరు లేకపోవడంతో ఆప్ నేత టవర్ ఎక్కి నిరసన తెలిపారు. టిక్కెట్ ఇచ్చేదాకా దిగిరానని హెచ్చరించారు. టవర్ ఎక్కడమే కాకుండా దాన్ని ఫేస్ బుక్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు. తనకు టికెట్ రాకపోవడానికి ఆప్ నాయకులు అతిషి, దుర్గేష్ పాఠక్ కారణం అని ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు. తాను చనిపోతే వీరిద్దరిదే బాధ్యత అని అన్నారు. ఈ ఆరోపణలపై ఆప్ స్పందించలేదు.

మున్సిపాల్టీలు సొంత రాబడి పెంచుకోవాలి..

- కేంద్ర, రాష్ట్ర గ్రాంట్లపై ఎక్కువగా ఆధారపడుతున్నాయి..
- విధుల నిర్వహణలో బలహీనపడుతున్నాయని హెచ్చరించిన ఆర్‌బిఐ నివేదిక
- స్థానిక సంస్థలు ప్రపంచంలోనే అత్యంత బలహీనం..



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా స్థానిక సంస్థలు తమ సొంత రాబడిని పెంచుకోవాలని, ఇందుకోసంగానూ సరికొత్త పద్ధతులు, ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాలని 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఆర్‌బీఐ) పేర్కొన్నది. ఆర్థిక నిర్వహణలో స్థానిక సంస్థల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా అర్బన్ ప్రాంతాల్లో స్థానిక సంస్థలు ఎక్కువగా కేంద్ర, రాష్ట్ర గ్రాంట్లపైన్నే ఆధారపడుతున్నాయని తప్పుబట్టింది. ఈ తరహా పోకడల వల్ల మున్సిపాల్టీలు తమ విధుల్ని పూర్తి సామర్థ్యంమేరకు నిర్వర్తించ లేకపోతున్నాయని హెచ్చరించింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లోని 201 మున్సిపల్ కార్పొరేషన్‌లపై అధ్యయనం చేసి 'మున్సిపల్ ఫైనాన్సెస్' నివేదికను ఆర్‌బీఐ తాజాగా విడుదల చేసింది. ఈ నివేదికలో పేర్కొన్న విషయాలు ఈ విధంగా ఉన్నాయి.

అంతా రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో..

ఇతర దేశాలతో పోల్చుకుంటే, ఆర్థిక స్వతంత్రలో మన పట్టణ ప్రాంతాల్లోని స్థానిక సంస్థలు ప్రపంచంలోనే అత్యంత బలహీనంగా ఉన్నాయి. పన్నులు, వినియోగదారు ఛార్జీలు విధించటం, మినహాయింపులు మంజూరు చేయటం, నిధుల కోసం రుణం తీసుకోవటం...ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే గ్రాంట్లపై ఎక్కువగా ఆధారపడుతున్నాయి. దీంతో విధులను నెరవేర్చటంలో సామర్థ్యం బలహీనపడింది. రాష్ట్ర ప్రభుత్వంలోని ఉన్నతస్థాయి అధికార వర్గాలపై ఆధారపడటం పెరిగింది. పట్టణ ప్రాంతాల్లా వేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకొని, వినూత్నమైన, సృజనాత్మక పద్ధతుల్లో ఆదాయాన్ని సమకూర్చుకోవాలి.

పనితీరులో మెరుగుదల ఏది?

దేశంలోని 201 మున్సిపల్ కార్పొరేషన్‌పై అధ్యయనం చేశామని ఆర్‌బీఐ నివేదిక పేర్కొన్నది. 1946-47 ఆర్థిక సంవత్సరం నాటితో పోల్చితే ఏ మున్సిపల్ కార్పొరేషన్ స్వీయ ఆదాయం పెరగలేదు. మొత్తం స్థానిక సంస్థల ఆదాయం, ఖర్చు దేశ జీడీపీలో ఒక్కశాతం వద్దే ఆగిపోయింది. ఇదే అంశం ఇతర దేశాలతో పోల్చుకుంటే, బ్రెజిల్‌లో 7.4శాతం, దక్షిణాఫ్రికాలో 6శాతముంది. రాజ్యాంగబద్ధంగా స్థానిక సంస్థల ఏర్పాటు జరిగినా, మున్సిపల్ కార్పొరేషన్ల పనితీరులో గణనీయమైన మెరుగుదల లేదు. సొంత ఆదాయాలు కూడా బలహీనంగా ఉన్నాయి. దాంతో అవి అందించే సేవలు కూడా దెబ్బతింటున్నాయి.

శాంతి చర్చలకు అవకాశం

- ఖేర్సన్ నుంచి రష్యా బలగాలు ఉపసంహరణపై అమెరికా



కీవ్ : ఉక్రెయిన్‌లో కీలక నగరమైన ఖేర్సన్ నుంచి తమ బలగాలను ఉపసంహరించు కుంటున్నట్లు రష్యా రక్షణ శాఖ మంత్రి సెర్జేయ్ షోయిగు ప్రకటించారు. రష్యా నిర్ణయాన్ని అమెరికా జాయింట్ ఛీఫ్స్ ఆఫ్ స్టాఫ్ మార్క్ మిల్లే స్వాగతించారు. ఉక్రెయిన్, రష్యా మధ్య శాంతియుత చర్చలకు ఇది తలుపులు తెరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యుద్ధోన్మాద నాటో ఒత్తిళ్లకు తలొగ్గి రష్యాకు పక్కలో బల్లెంలా ఉక్రెయిన్‌ను మార్చాలన్న పశ్చిమ దేశాల వ్యూహాలను చిత్తు చేస్తూ 8 నెలల కింద రష్యా సైనిక ఆపరేషన్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ఘర్షణలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలను రష్యా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. అయితే శాంతియుత మార్గాన్ని అనుసరించాల్సిన ఉక్రెయిన్ అధ్యక్షుడు, హాస్య నటుడు జెలెన్ స్కీ మాత్రం అమెరికా కనుసన్నల్లో నడుస్తూ రెచ్చగొట్టే వైఖరిని ప్రదర్శిస్తూ వచ్చిన సంగతి విదితమే. అయితే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, జెలెన్ స్కీ మధ్య చర్చలకు మార్గం సుగమం చేసే అంశాలే ఇప్పుడు ముఖ్యమని మిల్లే అభిప్రాయపడ్డారు. ప్రపంచ యుద్ధాల సమయంలోనూ చర్చలకు సరైన మార్గం లేకపోయిందని చెప్పుకొచ్చారు.

ఎవ్వరినీ వదిలిపెట్టం : జెలెన్ స్కీ

రష్యా బలగాలను పూర్తిగా బయటకు పంపేస్తామని ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్స్కీ అన్నారు. ఖేర్సన్ పట్టణం నుంచి రష్యా దళాలు నిష్క్రమించినట్లు కథనాలకు స్పందిస్తూ ఆయన ఈ ప్రకటన చేశారు. 'ఎవ్వరీని మరిచిపోం, ఎవ్వరీని వదలిపెట్టాం' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మరోవైపు ఖేర్సన్ పట్టణంలో మౌలిక సదుపాయాల పునరుద్ధరణపై అధికారులు దృష్టి పెట్టారు. రష్యన్ దళాలకు సహకరించినవారిని గుర్తించడంలో సహాయం చేయాలని స్థానికులకు ఉక్రెయిన్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. రష్యన్ దళాల నిష్క్రమణ తరువాత సుమారు 8 నెలల తరువాత ఉక్రెయిన్ ప్రభుత్వ సిబ్బంది ఖేర్సన్ ప్రాంతంలో సంచరించడం విశేషం. ఖేర్సన్ పట్టణంలో ప్రస్తుతం 200 మంది అధికారులు పని చేస్తున్నారని పోలీసు శాఖ పేర్కొంది.



రూ.11200 కోట్లతో మహమ్మారి నిధి

- జి 20 సభ్య దేశాల ఆవిష్కరణ

బాలి (ఇండోనేషియా) : కోవిడ్ లాంటి విపత్తులు భవిష్యత్తులో ముంచుకొస్తే ఎదుర్కొనేందుకు వీలుగా దాదాపు రూ.11200 కోట్ల (1.4 బిలియన్ డాలర్లు)తో మహమ్మారి నిధిని జి-20 సభ్య దేశాలు ఆదివారం ప్రారంభించాయి. ఈ నిధి ఏమాత్రం సరిపోదని, కనీసం రూ.2,48,000 కోట్ల (31 బిలియన్ డాలర్లు) అవసరమని జి20 సమావేశాలకు ఆతిథ్యమిస్తున్న ఇండోనేషియా అధ్యక్షులు జోకో విడోడో తెలిపారు. జి20 సభ్య దేశాల ఆరోగ్య, ఆర్థిక మంత్రులతో కలిసి మహమ్మారి నిధిని ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) ఛీఫ్ టెడ్రస్ అథనోమ్ గేబ్రేయేసస్, ప్రపంచ బ్యాంకు అధ్యక్షులు డేవిడ్ మలపాస్ పాల్గొన్నారు. మహమ్మారిని ఎదుర్కొనేందుకు జి20 సభ్య దేశాలు, సభ్యులుగా లేని దేశాలు, దాతృత్వ సంస్థలు ఇప్పటివరకూ సమకూర్చిన నిధులు ఏమాత్రం చాలవని విడొడో ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో జరిగే జి 20 సమావేశంలోనూ మహమ్మారి నిధి కీలక అజెండాలో ఒక అంశంగా ఉంది.

1500కు పైగా చట్ట సవరణలు

- డిసెంబర్ మొదటివారంలో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు!
- కొత్త భవనంలో వచ్చే బడ్జెట్ సమావేశాలు..

న్యూఢిల్లీ : దాదాపు 1500కు పైగా భారతీయ చట్టాలను సవరించడానికి మోడీ సర్కార్ సిద్ధమైంది. మరికొద్ది రోజుల్లో మొదలయ్యే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చట్ట సవరణల ప్రక్రియ చేపడతామని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. శీతాకాల సమావేశాలు డిసెంబర్ మొదటివారంలో ఉండొచ్చునని కేంద్ర ప్రభుత్వ వర్గాల సమాచారం. పార్లమెంట్ కొత్త భవనాన్ని లాంఛనంగా ప్రారంభించి..శీతాకాల సమావేశాలు నిర్వహించాలని మోడీ సర్కార్ తొలుత భావించింది. అయితే లక్ష్యానికి అనుగుణంగా కొత్త భవన నిర్మాణ పనులు పూర్తికావటం లేదు. దాంతో ఇప్పుడున్న పార్లమెంట్ భవనంలోనే శీతాకాల సమావేశాలు డిసెంబర్ 7 నుంచి 29 వరకు నిర్వహించాలని కేంద్రం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సాధారణంగా ప్రతిఏటా నవంబర్ 20 తర్వాత శీతాకాల సమావేశాలు నిర్వహిస్తారు. 2017, 2018లో మాత్రం సమావేశాలు డిసెంబర్‌లో నిర్వహించారు. వచ్చే ఏడాది బడ్జెట్ సమావేశాలు కొత్త భవనంలోనే ఉంటాయని తెలుస్తోంది. పార్లమెంట్ సంబంధాలపై ఏర్పాటైన కేంద్ర మంత్రివర్గ కమిటీ సమావేశాల షెడ్యూల్‌పై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సుమారుగా రూ.1200కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్న పార్లమెంట్ కొత్త భవన ప్రారంభోత్సవంపై మోడీ సర్కార్ సమాలోచనలు చేస్తోంది. ఈనెలాఖరులో లేదా డిసెంబర్ మొదటి వారంలో కొత్త భవనం ప్రారంభోత్సవం ఉంటుందని పీఎంవో వర్గాలు తొలుత వెల్లడించాయి. కొత్త భవనానికి లాంఛనప్రాయంగా ప్రారంభోత్సవం జరి పి, అందులోనే డిసెంబర్ మొదటివారంలో సమావేశాలు జరపాలని మోడీ సర్కార్ భావించింది. అయితే నిర్మాణ పనులేవీ నిర్ణీత సమయానికి పూర్తి కాలేదు. అంతేగాక కొత్త భవనంలో పనిచేయడానికి ప్రభుత్వ అధికారులకు, ఇతర సిబ్బందికి శిక్షణ అవసరమని, దీనికి 15-20 రోజులు పడుతుందని అధికార వర్గాలు తెలిపాయి.

నేడు జి20 సమావేశానికి ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : ఇండోనేషియాలోని బాలి నగరంలో ఈ నెల 15, 16 తేదీల్లో జరగనున్న జి20 శిఖరాగ్ర సమావేశాల్లో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం బయలు దేరి వెళ్లనున్నారు. మూడు కీలక సెషన్స్‌లో మోడీ పాల్గొంటారని విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వినయ్ క్వత్రా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజల పాటు మోడీ పర్యటన జరుగుతుందని, ఆహార-ఇంధన భద్రత, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఆరోగ్య రంగాలపై జరిగే సెషన్స్‌లో మోడీ పాల్గొంటారని తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఇంధనం, పర్యావరణం, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మొదలైన అంశాలపై మోడీ ఇతర నేతలు ఈ సమావేశంలో చర్చిస్తారని చెప్పారు. మోడీతో పాటు అమెరికా అధ్యక్షులు జో బైడెన్, చైనా అధ్యక్షులు జిన్‌పింగ్, బ్రిటన్ ప్రధాని రిషి సునక్, ఫ్రాన్స్ అధ్యక్షులు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, జర్మన్ ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్ కూడా పాల్గొననున్నారు. ఇండోనేషియా అధ్యక్షులు జోకో విడోడో ఆహ్వానం మేరకు మోడీ ఈ సమావేశంలో పాల్గొంటారు. జి20 ప్రసుత్త అధ్యక్ష దేశంగా ఇండోనేషియా ఉంది. డిసెంబర్ 1 నుంచి భారత్ అధ్యక్ష బాధ్యతల్ని తీసుకుంటుంది. భారత్‌తో పాటు అర్జెంటీనా, అమెరికా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, ఇంగ్లండ్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండోనేషియా, ఇటలీ, జపాన్, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, టర్కీ, ఇయూ, దక్షిణకొరియా దేశాలు జి20 దేశాలుగా ఉన్నాయి.

ఎన్నికల్లో పోటీ చేయను : ప్రశాంత్ కిషోర్

పాట్నా : తాను ఎన్నికల్లో పోటీ చేయనని ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ఆదివారం పేర్కొన్నారు. అయితే, తన సొంత రాష్ట్రమైన బీహార్‌కు మెరుగైన ప్రత్యామ్నాయాన్ని నిర్మించడానికి కట్టుబడి ఉన్నానని తెలిపారు. ప్రస్తుతం ప్రశాంత్ కిషోర్ 'జన సురాజ్' పేరిట పాదయాత్ర చేపడుతున్న సంగతి తెలిసిందే. 'జన్ సురాజ్'ను రాజకీయ పార్టీగా మార్చాలా.. వద్దా.. అనే విషయంపై ప్రశాంత్ కిశోర్ ఆయన బందంతో కలిసి ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. తనకి ఎన్నికల్ల పోటీ చేసే ఆకాంక్ష లేదని, పోటీ చేయనని స్పష్టం చేశారు. తనని 'స్వల్ప రాజకీయ చతురత ఉన్న వ్యాపారి'గా పేర్కొనడంపై స్పందించారు. బీహార్ సిఎం నితీష్‌కుమార్‌తో పాటు ఆయన పార్టీ జెడియుపై విమర్శలు గుప్పించారు. జెడియు నేతలను తనను విమర్శించేందుకు ఆత్రుత చూపుతున్నారని, తనకు రాజకీయ అవగాహన లేకపోతే రెండేళ్లుగా నితీష్ నివాసంలో ఏం చేశానో వారినే అడగాలని అన్నారు. తాను తిరిగి జెడియులో చేరితే నితీష్ మళ్లీ తనపై ప్రశంసలు కురిపిస్తారని చెప్పారు. తాను సొంతంగా ఒక కార్యాచరణతో ముందుకు వెళ్లడం నచ్చకే వారు తనపై ఆరోపణలు చేస్తున్నారన్నారని అన్నారు. తాను గతంలో నితీష్‌కుమార్ పార్టీ కోసం పనిచేసినందుకు ఏమాత్రం పశ్చాత్తాపపడడం లేదని ప్రశాంత్ కిషోర్ పేర్కొన్నారు. నితీష్ కుమార్ మారిపోయారని, 2014 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓటమికి బాధ్యత వహిస్తూ ఆయన అధ్యక్ష పదవిని వదులుకున్నారని గుర్తుచేశారు. కానీ, ఇప్పుడు అధికారం కోసం ఎంతవరకైనా వెళుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న జెడియు, ఆర్‌జెడి కూటమి ప్రభుత్వం ఏడాదికి 10 లక్షల ఉద్యోగాల హామీని నెరవేరిస్తే తాను జన్ సురాజ్ ప్రచారాన్ని విరమించుకుంటానని అన్నారు.

వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేయలేం

- కేరళ సిపిఎం ఎమ్మెల్యేపై పిటిషన్ తిరస్కరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేయలేమని ఢిల్లీ కోర్టు పేర్కొంది. కాశ్మీర్‌లో తన పరిశీలనకి వచ్చిన అంశాలను ఫేస్‌బుక్‌లో పోస్టు చేసిన కేరళకు చెందిన సిపిఎం ఎమ్మెల్యే కెటి జలీల్‌పై బిజెపి నేత, న్యాయవాది జిఎస్ మణి దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు తిరస్కరించింది. సమాజం చాలా అభ్యంతరకంగా భావించే చర్యలను వాక్ స్వాతంత్ర్యం పరిరక్షిస్తుందని, కేవలం వాక్ స్వాతంత్ర్యాన్ని అణిచివేసేందుకు సమాజంలో ఆగ్రహాలను సమర్థించలేమని పేర్కొంది. ఈ మేరకు రూస్ అవెన్యూ కోర్టు అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ హర్జీత్ సింగ్ జస్పాల్ ఆదేశాలు జారీ చేశారు. కాశ్మీర్ ప్రజలు సంతోషంగా లేరని జలీల్ చేసిన ప్రకటన ఆయన అభిప్రాయం మాత్రమేనని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ఇచ్చిన ప్రాథమిక స్వేచ్ఛతో కూడిన పౌరుల హక్కు అని స్పష్టం చేసింది. జలీల్ పోస్టు హిందువులు, ముస్లీముల మధ్య శత్రుత్వాన్ని సృష్టించే అవకాశం ఉందని బిజెపి నేత చేసిన వాదనలను న్యాయస్థానం కొట్టిపారేసింది.

ఔను ! అమిత్ షా తరపున వాదించా!

(మొదటి పేజీ తరువాయి)



అడిగారని తెలిపారు. అంటే ప్రభుత్వ మార్పిడికి ముందుగానే ప్రక్రియ మొదలైందని ఆయన చెప్పారు. 'నేను ఈ కేసులో ఎప్పుడూ ప్రధాన న్యాయవాదిగా హాజరుకాలేదు. అమిత్ షా సహా నిందితుడు తరుపున దీనికి అనుబంధ కేసులో వాదించాను. కానీ మెయిన్ కేసులో కాదు' అని జస్టిస్ లలిత్ తెలిపారు. అమిత్ షా వంటి ప్రభావశీల వ్యక్తులు నిందితులుగా ఉండే హై ప్రొఫైల్, అత్యంత వివాదస్పదమైన కేసుల్లో న్యాయవాదిగా వ్యవహరించిన యుయు లలిత్ 2014 ఆగస్టులో న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

న్యాయ నియామకాలకు కొలిజియమే భేష్

న్యాయ నిమాకాలకు సంబంధించి సుప్రీంకోర్టు కొలిజియం వ్యవస్థే సరైన, సమతుల్య మార్గమని జస్టిస్ యుయు లలిత్ అన్నారు. కొలిజియం వ్యవస్థకు సుప్రీంకోర్టులోని ఐదురుగు న్యాయమూర్తుల ధర్మాసనం ఆమోదం తెలిపిందని ఆయన గుర్తు చేశారు. న్యాయ నియామకాల మొత్తం ప్రక్రియలో భాగంగా తప్పనిసరిగా ప్రభుత్వం, కొలిజియం మధ్య సంప్రదింపులు జరగాలన్నారు. తాను సిజెఐగా ఉన్న కాలంలో నియామకాలు కాకపోవడంపై తనకు అసంతృప్తి ఏమీ లేదన్నారు. అయితే కర్ణాటక నుంచి హైకోర్టు న్యాయమూర్తిగా చాలా మంచి ప్రతిభ గల సీనియర్ న్యాయవాదిని సిఫార్సు చేశామని, కేంద్ర ప్రభుత్వం వద్ద ప్రక్రియ ముందుకు సాగలేదని తెలిపారు. ఆయన దాదాపు ఏడాదిగా వేచి చూస్తున్నారని, కొలిజియంకు లేఖ రాసి హైకోర్టు న్యాయమూర్తిగా ఉండేందుకు సమ్మతిని ఉపసంహరించుకున్నారని తెలిపారు. న్యాయవ్యవస్థ ప్రతిభ గల ఒక న్యాయ నిపుణుడిని నియమించుకోలేకపోయిందన్నారు.

పదవులు తీసుకోవడం మంచిది కాదు..

మహిళా న్యాయమూర్తులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, అయితే చాలా తక్కువ మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారని అన్నారు. దాన్ని అధిగమించాల్సిన అవసరం ఉందన్నారు. సుప్రీంకోర్టులో 34 మంది న్యాయమూర్తులు ఉండాలని, కానీ ప్రస్తుతం 27 మంది మాత్రమే ఉన్నారన్నారు. కేసుల ఒత్తిడి చాలా ఎక్కువ ఉందని తెలిపారు. న్యాయమూర్తులు పదవీ విరమణ తరువాత రాజ్యసభ, గవర్నర్ పదవులు తీసుకోవడం సరైనది కాదని జస్టిస్ యుయు లలిత్ అన్నారు. ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబా కేసు అత్యవసర లిస్టింగ్‌పై జస్టిస్ యయు లలిత్ వివరణ ఇస్తూ అదేమీ అసాధారణం కాదని పేర్కొన్నారు.



మీకోసం

ఐదు మిరియాలు, రెండు యాలకులు, చిన్న దాల్చిన చెక్క ముక్కను మెత్తటి పొడిలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని వేడి నీళ్లల్లో వేసి ఐదు నిమిషాలు మరిగించాలి. ఆపై ఆ నీళ్లను ఫిల్టర్ చేసుకుని అందులో ఒక టేబుల్ స్పూన్ తేనె కలిపి ప్రతి రోజూ ఉదయాన్నే తాగడం వల్ల గొంతులో పేరుకున్న కఫం కరిగిపోతుంది.

జీవన సౌరభం

చిన్నప్పుడు మంచి అలవాట్లు చేసుకుంటేనే పెద్దయ్యాక గొప్ప లక్ష్యాలను సాధించగలరు.

బాలల నేస్తం చాచా నెహ్రూ

నేడు బాలల దినోత్సవం




నవంబర్ 14 చిన్నారులందరూ బాగా గుర్తుంచుకునే రోజు. మన దేశ మొట్టమొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజును బాలల దినోత్సవంగా జరుపుకుంటాం. నెహ్రూకు, బాలలకు సంబంధం ఏమిటి? తెలుసుకుందామా!

జవహర్‌లాల్ నెహ్రూ నేటి ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ నగరంలో 1889 నవంబర్ 14న జన్మించారు. ఆయన తండ్రి మోతీలాల్ నెహ్రూ. తల్లి స్వరూపరాణి. మోతీలాల్ గొప్ప న్యాయవాది, మంచి పేరున్న రాజకీయవేత్త. వీరిది సంపన్న కుటుంబం. ఇంగ్లండ్ ట్రినిటీ కళాశాల్లో, ఆ తర్వాత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించారు. కొడుకు కూడా న్యాయవాది కావాలన్న ఆకాంక్షతో మోతీలాల్ నెహ్రూను పట్టుబట్టి మరీ న్యాయశాస్త్రం చదివించారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో చదువుకునేటప్పుడే నెహ్రూ ప్రపంచ రాజకీయాల పట్ల అవగాహన పెంచుకున్నారు. స్వదేశానికి తిరిగి వచ్చిన నెహ్రూను స్వాతంత్ర్యోద్యమం అమితంగా ఆకట్టుకుంది. స్వాతంత్ర్య సముపార్జన కోసం పోరాడేందుకే ఆయన మనసు మొగ్గు చూపింది. కొడుకు రాజకీయ ప్రవేశాన్ని మోతీలాల్ మొదట వ్యతిరేకించారు. పెళ్లి తర్వాత కూడా నెహ్రూ పోరాటంలోనే గడుపుతుండటంతో ఆయనలోని నిబద్ధతను గుర్తించి ప్రోత్సహించారు. స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ అడుగుజాడల్లో నడిచారు. తనతో పాటు ఎంతోమంది యువకులను జాతీయోద్యమం వైపు మళ్లేలా చేశారు. నెహ్రూ తొమ్మిదేళ్ల పాటు జైలుశిక్ష అనుభవించారు. అక్కడి నుంచే నెహ్రూ కుమార్తె ఇందిరా ప్రియదర్శినికి ఉత్తరాలు రాస్తూ ఉండేవారు. జైలు జీవితం గడిపేటప్పుడు 'గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ' అనే గ్రంథ రచన చేశారు. ఆయనలోని పోరాట పటిమ, కార్యదక్షత, అభ్యుదయ దృక్పథం పాటు నాయకత్వ లక్షణాలు కలిపి నెహ్రూను దేశానికి మొట్టమొదటి ప్రధానిని చేశాయి. 1964లో చనిపోయే వరకూ ఆయన మన దేశ ప్రధానిగా ఉన్నారు.

చిన్న వయసులోనే భార్య చనిపోయినా, తల్లి లేని లోటు తెలియకుండా కుమార్తెను ఎంతో ప్రేమగా పెంచారు. తనతోపాటు చుట్టుపక్కల పిల్లలను కూడా చేరదీసేవారు. ప్రేమగా లాలించేవారు. అందుకే అందరూ ఆయన్ను చాచా (బాబాయ్) అని పిలిచేవారు. ఓ సారి నెహ్రూకు ఓ పాఠశాల వార్షికోత్సవంలో ఓ చిన్నారి గులాబీ పువ్వును ఇచ్చింది. ఆ పువ్వును తీసుకుని ఆయన తన కోటుకు అలంకరించుకున్నారు. దాంతో ఆ చిన్నారి మొఖం ఆనందంతో వెలిగిపోయింది. అప్పటినుంచి ఆయన కోటుకు గులాబీని అలంకరించుకోవడం మొదలు పెట్టారు. బాలల పట్ల నెహ్రూకు ఉన్న ప్రేమను చూసి, ఆయన మరణానంతరం నవంబరు 14ను బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

నేను గీసిన బొమ్మ






సాయి కృష్ణ,
6వ తరగతి,
ఇంగ్లీషు మీడియం,
జెడ్పీహెచ్ఎస్,
హవేలీ, ఘనాపూర్,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఈ సమాజం మాది కూడా...



మేం పిల్లలం. అమ్మానాన్నలతో కలిసి ఉంటాం. పెద్దలు చెప్పింది వింటాం. పెద్దల ద్వారా చాలా చాలా నేర్చుకుంటాం. పెద్దలు తీసుకువెళితేనే– రకరకాల చోట్లకు వెళతాం. పెద్దలు చెప్పిన మాటల్లోంచే కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటాం. ప్రతి పనికీ క్షణక్షణం పెద్దల సహకారం తీసుకుంటూ ఉంటాం. ఇలాగేనా, మేం ఎదగాల్సింది? మాకు మేముగా తిరిగే, చూసే, తెలుసుకునే ఏర్పాట్లు ఇంటా బయటా ఏమైనా ఉన్నాయా? ఎందుకంటే ... ఈ సమాజం మాది కూడా కదా?!

ఒక్క స్కూల్లో మాత్రమే మాకు సరిపడే బెంచీలూ, కుర్చీలూ, డెస్కులూ ఉంటాయి. మిగతా అన్నిచోట్లా పెద్దవాళ్ల కోసం సిద్ధం చేసిన కుర్చీల్లో, సోఫాల్లో మేం కూర్చోవాలి. సినిమా చూడ్డం మాకు చాలా ఇష్టం. థియేటర్లో చూడ్డం ఇంకా ఇంకా ఇష్టం. వయసు మూడేళ్లు దాటితే చాలు, హాల్లో టికెట్టు తీసుకుంటారు? మరి ఆ హాల్లో మేం సినిమా చూడ్డం ఎలాగ? పెద్దవాళ్ల లాగా కాలు మీద కాలేసుకొని దర్జాగా చూడగలమా? పిల్లలను దృష్టిలో పెట్టుకొని ఒక్క కుర్చీ కూడా ఉండదు. కూచుంటే తెర కనపడదు. నించుంటే వెనక ఉన్నోళ్లకు అడ్డం. అమ్మ ఒళ్లోనే, నాన్న అడ్డాల్లోనో కూచోవాలి. తల పక్కకు వొంచుకొని చూడాలి. అది ఎంత కష్టమో ఆలోచించండి.

ఇంటర్వెల్‌లో వాష్‌రూంకి వెళ్లాల్సి వస్తే అదొక నరకం. ఒకటికి వెళ్లాలి అన్నా పెద్దోళ్ల తోడు కావాలి. మా పని మేం స్వతంత్రంగా కానిచ్చే ఎత్తులో యూరినల్ ట్రేలు ఎందుకని నిర్మించరు? మేమంటూ ఉన్నామని పెద్దోళ్లు ఎందుకు గుర్తించరు? అన్యాయం కదా ఇది. ఈ సమాజం మాది కూడా కదా!

సినిమా కథలో పిల్లలు ఉండడమే తక్కువ. ఒకటో రెండో పాత్రలు ఉన్నప్పుడు కూడా ... పిల్లలు పిల్లల్లాగా ప్రవర్తించాలి కదా? కానీ, పెద్ద ప్రేమికులకు రాయబారుల్లాగానో, ముదురుమాటలకు కేరాఫ్ అడ్రసుల లాగానో ఎందుకు చిత్రీకరిస్తారు? పిల్లలకొక ప్రపంచం ఉంటుంది కదా? పిల్లల మాటలూ, చేతలూ, ఆటలూ ... వేరుగా ఉంటాయి కదా? వాటినెందుకు సినిమాల్లో పెట్టరు? గతంలో పిల్లలే ప్రధానంగా ఉన్న, పిల్లల ప్రపంచమే ప్రధాన కథాంశంగా ఉన్న సినిమాలు వచ్చాయని నాన్నమ్మ చెబుతూ ఉంటుంది. మరిప్పుడు ఎందుకని మమ్మల్ని మర్చిపోతున్నారు? ఈ సమాజంలో మేం కూడా ఉన్నాం కదా!

సోవియట్ రష్యా ఉన్నప్పుడు ప్రపంచంలోని అన్ని దేశాల పిల్లలకూ ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చేవారని, పిల్లల కోసం ఎన్నో అందమైన పుస్తకాలు రంగురంగుల్లో వెలువరించేవారని మావయ్య చెప్పాడు. తాను చిన్నప్పుడు చదివిన రంగురంగుల బొమ్మల పుస్తకాలు చూపించాడు కూడా! మరి అలాంటి ప్రయత్నం ఇప్పుడు ఎందుకు జరగటం లేదు. పిల్లలకు అందమైన ప్రపంచాన్ని అందంగా పరిచయం చేయడం పెద్దలందరి బాధ్యత కదా! ప్రభుత్వాలు కూడా ప్రత్యేకించి బడ్జెట్లో నిధులు కేటాయించాలి. సమాజంలో ఎక్కడ చూసినా పిల్లల వికాసం కోసం, పిల్లల సంరక్షణ కోసం ఏర్పాట్లు ఉండాలి కదా? మమ్మల్ని రేపటి పౌరులు అంటారు కదా.. మరి ఇప్పటి నుంచే మంచి పౌరుల నిర్మాణం జరగాలి. ఫిన్లాండు, స్విడ్జర్‌ల్యాండ్ వంటి దేశాల్లో పిల్లలకు ప్రత్యేకమైన నిధుల కేటాయింపు ఉంటుంది అట. రోడ్ల మీద పిల్లల సైకిళ్లకు ప్రత్యేకమైన ట్రాక్ ఉంటుంది అట! పిల్లల రక్షణ కోరే సమాజం చేయాల్సిన పని ఇదే కదా?

పిల్లల కథలు పిల్లలకు ఉండాలి. పిల్లల పత్రికలు, పుస్తకాలు ప్రత్యేకంగా వెలువడాలి. పిల్లల చేత పాఠ్యేతర పుస్తకాలు చదివించటం, కథలూ గేయాలూ రాయించటం ... ఒక అభిరుచిలా కాదు; సమాజానికి ఒక అలవాటుగా, అవసరంగా ఉండాలి. ఇంట్లోనూ, బళ్లోనూ ... ఇంకా అన్నిచోట్లా అలాంటి వాతావరణం కల్పించాలి. మేం పెద్దవాళ్ల కలలను పండించే సాధనాలం కాదు. వస్తువులం కాదు. మేం పిల్లలం. మాకు మేముగా అచ్చం మాలాగ ఎదిగే మనుషులం. అమ్మానాన్నా, అత్తామామా, టీచరూ ... అందరూ అలాగే చూడాలి మమ్మల్ని. పుట్టీ పుట్టగానే నీట్ కలనో, ఐఐటీ స్వప్నాన్నో మా మెడలో ట్యాగుగా వేలాడదీయకండి. ఆటలతో పాటలతో ఆహ్లాదంగా మమ్మల్ని ఎదగనివ్వండి. మేము పెద్దయ్యాక – అందరిలాగానే ఏదొకటి అవుతాం. మాకు ఎలా ఇష్టమో అలా అవుతాం. మీమీ ఇష్టాలను మాపై రుద్దకండి.

స్కూళ్లను స్కూళ్ల మాదిరిగా ఉండనీయండి. వాటిని నిరంతర పోటీ కేంద్రాలుగా, పరీక్షా క్షేత్రాలుగా మార్చేసి చాలా కాలమైంది. వాటిని మార్చండి. పిల్లలకు పనికొచ్చేవిగా మార్చండి. బడిలో బాల్యాన్ని చేర్చండి. బాల్యం లేని బడులు అసలు బడులే కాదని గుర్తించండి. ఆడడం, పాడడం, గెంతటం, దుమకటం, నవ్వడం, ఏడ్వడం, తినటం, పారేయడం, ఆశ్చర్యపోవడం, అలగడం ... ఇలా ఎన్నో ఎన్నో మా ప్రపంచం నిండా ఉంటాయి. వాటిని అలాగే ఉండనీయండి. వాటి మధ్యలోంచి తలమునకలవుతూ, తదాత్మ్యం చెందుతూ మమ్మల్ని ఎదగనీయండి. పెద్ద పెద్ద ఆశలూ లక్ష్యాలూ ఇప్పటినుంచే మా తల మీదికి ఎక్కించి, ఆ భారాల మోతలో మమ్మల్ని మీ వలె మార్చేయకండి. ఈ సమాజంలో మేమూ భాగమే! మాతో పాటు మా ఆటలూ పాటలూ అల్లరీ భాగమే!

పెద్దల్లారా, మా ప్రపంచాన్ని గుర్తించండి. మా లోకాన్ని మేమే ఏలుకునే, మేమే గెలుచుకునే అవకాశాన్ని మా దగ్గరే ఉంచండి. మా ఆటలు మాకుండాలి. మా పాటలు మేం పాడుకోవాలి. ఆటస్థలాలు ఉండాలి. ఇంటా బయటా ... ఎక్కడన్నా సరే – "ఇవి పిల్లలవి" అని స్పష్టంగా కేటాయించిన వాటా మాకు ఉండాలి. ఎందుకంటే మేం అన్నిటా భాగస్వాములం. అన్నిటికీ సొంతదారులం. ఎందుకంటే –

ఈ సమాజం మాది కూడా!

– సుజయ సాహితి

నవంబరు 14 బాలల దినోత్సవం సందర్భంగా ఈనెల 9వ తేదీ నుంచి ఇస్తున్న ఈ ప్రత్యేక కథనాల ప్రచురణ ఈరోజుతో పూర్తయింది. ఈ వ్యాసాలపై ఎప్పటికప్పుడు తమ స్పందన తెలియజేసిన పాఠకులకు ధన్యవాదాలు.


– ఎడిటర్

పిల్లలే ప్రధానంగా ...

చిత్ర పరిశ్రమలో పిల్లలకంటూ ఓ ప్రత్యేకమైన స్థానం ఉంది. పాత చిత్రాల్లో ఎక్కువగా కీలకమైన సన్నివేశాల్లో పిల్లల ప్రమేయం ఉండేలా చేసేవారు దర్శక నిర్మాతలు. కథ అంతా పిల్లలతోనే తీసిన సినిమాలూ ఉన్నాయి. ఆ సినిమాలు అన్ని వర్గాల ప్రజలను, ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా పిల్లలకు మంచి మెసేజ్‌పరంగానూ ఉన్నాయి. జనరేషన్ మారుతున్న కొద్దీ ఇప్పుడు తీస్తున్న సినిమాల్లో హీరో హీరోయిన్ల బాల్యాన్ని చూపించేటప్పుడు మాత్రమే పిల్లలు ఉంటున్నారు. కాని వారి పాత్ర ఆకట్టుకునే స్థాయిలో, పిల్లలందరూ చూసేలా ఉండటం లేదు.



బాలల సినిమా అనగానే వెంటనే గుర్తు వచ్చేది లవకుశ (1963). తెలుగులో పూర్తి కలర్‌తో వచ్చిన మొట్టమొదటి చిత్రం ఇది. ఇందులో లవుడిగా నాగరాజు, కుశుడుగా సుబ్రహ్మణ్యం నటించారు. సినిమా చిత్రీకరణలో ఐదు సంవత్సరాలు సాగింది. దాంతో లవకుశులుగా నటించిన పిల్లల ఆకారాల్లో మార్పులు వచ్చాయి. వీరి అద్భుతమైన నటనతో ప్రేక్షకులను కథలో లీనమైయ్యేలా చేయడంతో ఈ తేడాలు పెద్దగా కనిపించలేదు. ఆరోజుల్లో సినిమా అఖండ విజయం సాధించింది. పిల్లల నటనాశక్తి అద్భుతమని–వారితో అద్భుతాలు సృష్టించవొచ్చు ఈ సినిమా నిరూపించింది. మళ్లీ అంతటి ఘన విజయం సాధించిన చిత్రంగా 'భక్తప్రహ్లాద' నిలిచింది. దీనిలో ప్రహ్లాదుడిగా రోజారమణి నటించింది. రోజారమణికి అప్పటికి ఐదేళ్లు.పామును మెడలో వేసుకుని నటించిన సీను ప్రతిఒక్కర్నీ ఆశ్చర్యపరిచింది. చిత్రంలో పద్యాలకు రోజారమణి ఇచ్చిన లిప్ మూవ్‌మెంట్ చూసి దర్శకనిర్మాతలతో పాటు స్టూడియోలో అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. 1966లో వచ్చిన 'లేత మనసులు' చిత్రంలో బేబీ పద్మిని ద్విపాత్రాభినయం చేసింది. హరనాథ్, జమున, రేలంగి, జి.వరలక్ష్మి వంటి సీనియర్ నటీనటులున్నా కథంతా పాప చుట్టూనే తిరుగుతుంది. ఇందులో 'పిల్లలు దేవుడూ చల్లనివారే!' అనే పాట ఇప్పటికీ పిల్లల మనసుల్లో నిలిచి ఉంటుందనడంలో సందేహం లేదు. విడిపోయిన తల్లిదండ్రులను కలిపేందుకు పిల్లలు చేసిన ప్రయత్నంగా ఈ సినిమా అప్పట్లో మంచిపేరు సంపాదించింది. ఇప్పుడు ఈ తరహా సినిమాలు కొరవడ్డాయి.



హీరో హీరోయిన్లు లేకుండా కేవలం చిన్నపిల్లవాడిని ఆధారం చేసుకుని నిర్మించిన చిత్రం 'పాపం పసివాడు'. ఎడారిలో తప్పిపోయిన చిన్న పిల్లవాడి ఒంటరి పోరాటమే ఈ చిత్ర కథాంశం. మాస్టర్ రాము ప్రధాన పాత్ర పోషించారు. నలువైపులనుంచీ మృత్యువు తరుముతున్నా నిబ్బరం కోల్పోకుండా చేసిన పోరాటం అందర్నీ మంత్రముగ్ధుల్నీ చేసింది. చూసిన ప్రతిఒక్కరూ సినిమాలో లీనమై ఎమోషనల్ అయ్యారు. 'అమ్మా చూడాలి, నిన్ను నాన్నని చూడాలి' అనే పాట ప్రజాదరణ పొందింది. ఆ తర్వాత కాలంలోనూ పిల్లలే కీలకంగా వచ్చిన చిత్రాలు చాలానే ఉన్నాయి.

కోదండరామిరెడ్డి దర్శకత్వంలో చిరంజీవి హీరోగా తీసిన చిత్రం 'పసివాడి ప్రాణం'. మూగ పిల్లవాడి కీలకంగా కథ మొత్తం నడుస్తుంది. మాట్లాడలేని, వినపడని ఒక పిల్లాడు (బేబి సుజిత) నటన సహజంగా ఉంది. కె. విశ్వనాథ్ దర్శకత్వంలో విడుదలైన సంగీత ప్రధానమైన చిత్రం 'స్వాతి కిరణం. ఇందులో గంగాధరంగా నటించిన మంజునాథ్ పాత్ర కీలకం. సాంప్రదాయ సంగీత గురువు తన శిష్యుడి ఉన్నతిని తట్టుకోలేక ఈర్ష్యకు లోనై అతని మరణానికి కారణమవుతారు. ఈ చిత్రం అప్పట్లో సంగీత ప్రియులను ఆలోజింపచేసింది. ఆ తర్వాత వచ్చిన సినిమాల్లో బేబీషాలిని, మహేష్‌బాబు, తరుణ్ బాలనటులుగా కీలక సన్నివేశాల్లో నటించి ప్రేక్షకులను దగ్గరయ్యారు. కోడి రామకృష్ణ దర్శకత్వంలో వచ్చిన 'అమ్మోరు' చిత్రంలో దేవతగా నటించిన సునైనాను ఎవరూ మర్చిపోలేరు. పెద్ద బొట్టు, పెద్ద కళ్లతో డైలాగ్స్ తగ్గట్టుగా నటించి ఎన్నో అవార్డులు పొందింది. శ్రీను వైట్ల దర్శకత్వంలో వచ్చిన 'రెడీ' చిత్రం ద్వారా మాస్టర్ భరత్ చిత్రపరిశ్రమకు పరిచయమయ్యారు. చిట్టినాయుడు పాత్రలో డైలాగ్స్ చెప్పి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. రామ్, కాజల్ కాంబినేషన్‌లో వచ్చిన 'గణేష్' చిత్రంలో చాలా మంది పిల్లలు ఉన్నారు. 'వీళ్ల పిల్లలు కాదు–చిచ్చర పిడుగులు' అనేట్లు కీలక పాత్రలో నటించి కథను నడిపించారు. సినిమాలు అంటే వినోదం మాత్రమే కాదు. అవి కుటుంబాల్లో కీలకమైన బాలల్ని ఆకట్టుకునేలా, విజ్ఞానాన్ని పంచేలా, ఆలోచింపచేశాలా ఉంటే మరింత బాగుంటాయి.









విజేత ఇంగ్లండ్

టీ20 ప్రపంచకప్ బట్లర్‌సేన వశం
ఫైనల్లో పాకిస్తాన్‌పై మెరుపు విజయం
ఛేదనలో బెన్ స్టోక్స్ అజేయ అర్ధ సెంచరీ



ఇంగ్లాండ్ కెప్టెన్ జోశ్ బట్లర్

ప్రజాశక్తి స్పోర్ట్స్ : ఇంగ్లండ్ సాధించింది. చారిత్రక అనుకూలతతో పాకిస్తాన్ కప్పు కోసం పోటీపడినా.. దూకుడు ఏమాత్రం తగ్గని ఇంగ్లాండ్ జట్టునే విజయం వరించింది. 2022 ఐసీసీ టీ20 ప్రపంచకప్‌గా ఇంగ్లండ్ అవతరించింది. ఆదివారం మెల్‌బోర్న్‌లో పాకిస్తాన్‌తో జరిగిన ఫైనల్లో 5 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్ ఘన విజయం సాధించింది. 2010లో తొలిసారి ఐసీసీ టీ20 ప్రపంచకప్ అందుకున్న ఇంగ్లండ్.. తాజాగా పాక్‌ను చిత్తు చేసి రెండోసారి పొట్టి ప్రపంచకప్‌ను ఎగరేసుకుపోయింది. 138 పరుగుల సవాల్‌తో కూడిన ఛేదనలో స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ (52 నాటౌట్, 49 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధ సెంచరీతో కదం తొక్కాడు. మిడిల్ ఆర్డర్‌లో కీలక భాగస్వామ్యాలు నిర్మించిన బెన్ స్టోక్స్.. హ్యారీ బ్రూక్ (20), మోయిన్ అలీ (19) సహా జోశ్ బట్లర్ (26, 17 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) సాయంతో ఇంగ్లండ్‌ను విజేతగా నిలిపాడు. బెన్ స్టోక్స్ రాణించటంతో మరో ఆరు బంతులు మిగిలి ఉండగానే ఇంగ్లాండ్ విజయాన్ని అందుకుంది. అంతకముందు, తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 137 పరుగులు చేసింది. ఇంగ్లండ్ పేసర్ శామ్ కరణ్ (3/12), క్రిస్ జోర్డాన్ (2/27) నిప్పులు చెరుగగా, స్పిన్నర్ ఆదిల్ రషీద్ (2/22) మాయ చేశాడు. బాబర్ ఆజాం (32, 28 బంతుల్లో 2 ఫోర్లు), షాన్ మసూద్ (38, 28 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), షాదాబ్ ఖాన్ (20, 14 బంతుల్లో 2 ఫోర్లు) రాణించారు. ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ శామ్ కరణ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ' అవార్డును సైతం సొంతం చేసుకున్నాడు. ఇంగ్లాండ్ పొట్టి ప్రపంచకప్ విజేతగా అవతరించగా, పాకిస్తాన్ రన్నరప్‌తో సరిపెట్టుకుంది.



బెన్ స్టోక్స్



శామ్ కరణ్

స్టోక్స్ హీరోచితం : లక్ష్యం 138 పరుగులు. మెల్‌బోర్న్ మైదానంలో ప్రమాదకర పాక్ పేసర్లను ఎదుర్కొన్నప్పుడు ఈ లక్ష్యం అంత చిన్నదేమీ కాదు. ఈ సంగతి ఇంగ్లండ్‌కు బాగా తెలుసు. అయినా, ఆ జట్టు దూకుడు మంత్రం వీడలేదు. కెప్టెన్ జోశ్ బట్లర్ (26, 17 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) ఎదురుదాడికి నాయకత్వం వహించాడు. షహీన్ షాకు బౌండరీతో స్వాగతం పలికిన బట్లర్. నషీం షా, హరీశ్ రవూఫ్‌లకు అదే రీతిలో బదులిచ్చాడు. నషీం ఓవర్లో ఫైన్ లెగ్‌లో సిక్సర్‌తో అదరగొట్టాడు. తొలి ఓవర్లోనే అలెక్స్ హేల్స్ (1)ను షహీన్ షా అఫ్రిది అవుట్ చేసినా.. బట్లర్ వెనక్కి తగ్గలేదు. రెండు బౌండరీలతో జోరందుకున్న ఫిల్ సాల్ట్ (10)ను రవూఫ్ సాగనంపాడు. బట్లర్ కోసం స్లిప్స్‌లో పన్నాగం పన్నిన పాక్.. ఎట్టకేలకు ఇంగ్లండ్ సారథి వికెట్ల వెనకాల దొరకబుచ్చుకుంది. దీంతో పవర్‌ప్లేలోనే ఇంగ్లండ్ టాప్–3 వికెట్లు కోల్పోయింది. పవర్‌ప్లే ముగిసేసరికి ఇంగ్లండ్ స్కోరు 49/3.

ఈ పరిస్థితుల్లో బెన్ స్టోక్స్ (52 నాటౌట్) గెలుపు బాధ్యతలను భుజాన వేసుకున్నాడు. తొలుత హ్యారీ బ్రూక్ (20)తో కలిసి స్టోక్స్ విలువైన భాగస్వామ్యం నిర్మించాడు. పాకిస్తాన్ బౌలర్లు విజృంభిస్తున్న తరుణంలో ఈ జోడీ జాగ్రత్తగా ఆడింది. ఎడాపెడా షాట్లకు వెళ్లకుండా సంయమనంతో పరుగులు సాధించింది. బ్రూక్ నిష్క్రమణతో స్టోక్స్‌కు మోయిన్ అలీ (19) తోడయ్యాడు. ఈ జోడీ ఇంగ్లాండ్‌ను గెలుపు తీరాలకు చేర్చింది. ఒత్తిడి పెరుగుతున్న దశలో మూడు బౌండరీలు బాదిన మోయిన్ అలీ.. సమకరణాలను సవరించాడు. షహీన్ షా అఫ్రిది గాయంతో మైదానం వీడగా.. ఆ ఓవర్లో చివరి ఐదు బంతులు సంధించిన ఇఫ్తీకార్ అహ్మద్‌ను స్టోక్స్ విడిచిపెట్టలేదు. ఓ ఫోర్, సిక్సర్‌తో విలువైన పరుగులు పిండుకున్నాడు. ఆరు పరుగులు అవసరమైన దశలో మోయిన్ అలీ అవుటైనా.. లియాం లివింగ్‌స్టోన్ (1 నాటౌట్) జతగా స్టోక్స్ లాంఛనం ముగించాడు. మహ్మద్ వసీంపై ఓ బౌండరీతో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న స్టోక్స్.. ఆ తర్వాత సింగిల్‌తో ఇంగ్లండ్‌కు వరల్డ్‌కప్‌ను కట్టబెట్టాడు. 19 ఓవర్లలోనే ఇంగ్లండ్ 138 పరుగులు సాధించింది. పాకిస్తాన్ బౌలర్లలో హరీశ్ రవూఫ్ (2/23), షాదాబ్ ఖాన్ (1/20), షహీన్ షా అఫ్రిది (1/13) రాణించారు.

కరణ్, రషీద్ జోరు! : టైటిల్ పోరులో టాస్ నెగ్గిన ఇంగ్లండ్.. తొలుత పాకిస్తాన్‌కు బ్యాటింగ్ అప్పగించింది. పేస్‌కు అనుకూలించే పిచ్‌పై పాక్ ఓపెనర్లు శుభారంభం చేశారు. మహ్మద్ రిజ్వాన్ (15, 14 బంతుల్లో 1 సిక్స్), బాబర్ ఆజాం (32, 28 బంతుల్లో 2 ఫోర్లు) తొలి వికెట్‌కు 29 పరుగులు జోడించారు. ప్రమాదకరంగా మారుతున్న ఓపెనింగ్ జోడీని శామ్ కరణ్ వీడదీశాడు. రిజ్వాన్‌ను బౌల్డ్ చేసిన కరణ్ ఇంగ్లాండ్‌కు బ్రేక్ సాధించాడు. పవర్‌ప్లే అనంతరం పాకిస్తాన్ 39/1తో మెరుగైన స్థితిలో నిలిచింది. మహ్మద్ హరీశ్ (8)ను అవుట్ చేసిన రషీద్ పాక్‌పై ఒత్తిడి పెంచాడు. కానీ బాబర్‌తో కలిసి షాన్ మసూద్ (38, 28 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) కీలక భాగస్వామ్యం నమోదు చేశాడు. ఈ జోడీ చివరి ఓవర్లలో ఎదురుదాడికి గట్టి పునాది వేసింది. కానీ ఆదిల్ రషీద్ మ్యాజిక్‌తో బాబర్‌ను రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. అప్పటికి పాక్ స్కోరు 84/3. కానీ ఆ తర్వాత పాకిస్తాన్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఓ ఎండ్‌లో షాన్ మసూద్ నిలిచినా.. మరో ఎండ్‌లో సహకారం అందించే బ్యాటర్ కరువయ్యాడు. షాదాబ్ ఖాన్ (20, 14 బంతుల్లో 2 ఫోర్లు) కాసేపు మెప్పించాడు. ఇఫ్తీకార్ అహ్మద్ (0), మహ్మద్ నవాజ్ (5)లు తేలిపోయారు. చివరి ఐదు ఓవర్లలో 31 పరుగులే చేసిన పాక్ ఏకంగా 4 వికెట్లు చేజార్చుకుంది. కరణ్ మూడు వికెట్ల ప్రదర్శనతకు రషీద్ రెండు వికెట్ల మాయజాలం తోడైంది. దీంతో పాకిస్తాన్ 20 ఓవర్లలో 137 పరుగులే చేసింది. క్రిస్ జోర్డాన్ సైతం రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68